KLVA 102M315

రిపోర్టులు, రచనలు పంపవలసిన చిరునామా :
ఎడిటర్
ప్రజాపంథా
ఇం.నెం. 2-1-716 (B-6, F-7)
ఎస్వీఎస్ స్కూలు ఎదురుగా, విజ్ఞానపురికాలనీ, విద్యానగర్
హైదరాబాద్ - 500 044. ఫోన్ : 9490700944

ప్రజాపంథా
సి.పి.ఐ (ఎం.ఎల్) - న్యూడెమోక్రసీ పక్షపత్రిక

సంపుటి : 30 సంచిక : 6 01-10-2013 పేజీలు : 12 ప్రచురణ స్థలం : హైదరాబాద్ ఎడిటర్ : మాదాల నారాయణస్వామి వెల : 8/-

ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలి!

కుల సమస్యపై హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సదస్సు డిమాండ్

మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 141వ ఆవిర్భావ దినం సందర్భంగా సెప్టెంబర్ 24న సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సు విజయవంతమైంది. కుల నిర్మూలన అవగాహన-ఆచరణాత్మక కార్యక్రమం సందర్భంగా జరిగిన రాష్ట్ర సదస్సుకు సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ సభ్యులు ఎస్. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా కె.ఆర్. వేణుగోపాల్ (ఐ.ఎ.ఎస్, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి), సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥ టాన్యా, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వ్యవస్థాపకులూ, సీనియర్ జర్నలిస్టులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఉస్మానియా యూనివర్శిటీకి చెందిన డాక్టర్ కొండా నాగేశ్వర్, పీడీయస్‌యు ఓయు అధ్యక్షులు కోట రాజేశ్‌లు ప్రసంగించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఖచ్చితంగా అమలు కోసం పోరాడుదాం, భూ పరిమితి చట్టాన్ని సవరించి మిగులు భూములను దళితులకు, పేదలకు పంపిణీ కోసం ఉద్యమిద్దాం- అనే నినాదంతో జరిగి ఈ సదస్సులో కె.ఆర్. వేణుగోపాల్ (కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, ఐ.ఎ.ఎస్) ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు.

భూ సంస్కరణలు అమలు కాకుండా దళితులకు సమానత్వం లేదు. రక్షణ లేదు. - కె.ఆర్. వేణుగోపాల్

భారత సమాజంలో నాలుగు వేల సంవత్సరాలుగా అంటరానితనం కొనసాగుతున్నది. అనేక పోరాటల ఫలితంగా, అంబేద్కర్ కృషి వలన 1950లో అంటరానితనం నిర్మూలన చట్టం చేశారు. అయినా హైదరాబాద్‌కు 15 కి.మీ. దూరం వెళితే, గ్రామాల్లో నేటికీ అమానుషమైన అంటరానితనం కనిపిస్తుంది. చట్టాల వలన ఎలాంటి మార్పులేదు. ఈ వాస్తవాన్ని పాలకవర్గాలు గుర్తించడంలో విఫలమవుతున్నాయి. దేశానికి ప్రధానిగా వున్న వాజ్‌పేయి దేశంలో ఇంకా అంటరానితనం వుందా అని అన్నాడట. అంటే, దళితులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాల దృష్టి ఎలా వుందో అర్థమవుతుంది.

స్వేచ్ఛగా పుట్టిన మానవుడు సర్వత్రా సంకెళ్ళతో వున్నాడని రూసో అన్నాడు. దానికొనసాగింపుగా, ప్రపంచ కార్మికులకు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప- అని కారల్ మార్క్స్ అన్నాడు. ఈ నినాదాలను మన దేశానికి వర్తింప చేసుకుంటే తరతరాలుగా అణగారిన కులాలు కుల సంకెళ్ళతో బంధించ బడి వున్నాయి. కుల సంకెళ్ళ నుండి, దోపిడీ నుండి విముక్తి చేయడానికి మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతం, ఆ సిద్ధాంతాన్ని మార్గదర్శకంగా కలిగిన కార్మిక వర్గ పార్టీ అవసరం. 1917లో రష్యాలో సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. ఈ ప్రభావం వలనే, భారత రాజ్యాంగంలో సోషలిజం అనే మాటను చేర్చారు. అయితే అమలు చేయలేదు. ఐక్యరాజ్య సమితి డిక్లరేషన్‌లో, మన రాజ్యాంగంలో మానవ హక్కుల గురించి ప్రకటించారు. ప్రతి ఒక్కరూ తల్లి గర్భం నుండి హక్కులతోనే పుట్టినప్పటికీ, అనుభవంలో కొద్దిమంది ధనికులకే అవి చెందుతాయి. హక్కులు ఆచరణలో పొందేట్టు చేయడంలో ప్రభుత్వానిదే ప్రధాన బాధ్యత. 66 సం॥లుగా ఈ ప్రధాన బాధ్యతను నెరవేర్చడంలో విఫలమవుతున్నారు. హక్కులంటే అవసరాలే. ఆర్థికంగా స్వతంత్రుడైతేనే, మనిషి స్వేచ్ఛగా వుంటాడని అంబేద్కర్ చెప్పాడు. అయితే వందల కోట్లతో అంబాని 27 అంతస్తులు కట్టాడు. ఒక దళితుడికి గుడిసె కూడా లేదు. ఈ తేడా ఏమిటి? రాజ్యాంగంలో చెప్పిన సమానత్వం ఎక్కడ అమలవుతున్నది?

అమానుషమైన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో ప్రతి ఒక్క కులం కింద ఐదారు కులాలు వుంటాయి. ఇక కులాన్ని ఎలా వదులుకుంటారు? ఇక అగ్రకులం వాళ్ళ సంగతి చెప్పనవసరం లేదు. అంబేద్కర్ చెప్పిందేమిటంటే, ఎవరికైతే కులం వద్దో, వాళ్ళు వదులుకోవాలని. కొంత మంది నా కులం ఏమి చేసినా సమర్థించేస్తారు. మూఢనమ్మకం లాంటిదే అది. అంబేద్కర్ కులం, వర్గం ఒకటే అని చెప్పలేదు. యూరోపియన్ దేశాల్లోని వర్గాలకూ, భారత్‌లోని కులాలకు కొన్ని సారూప్యతలున్నప్పటికీ కులం, వర్గం ఒకటి కాదు. గ్రామాల్లోని అగ్రకుల రైతు ఐ.ఎ.ఎస్ దళితుడ్ని కూడా ఒక అంటరానివాడిగానే చూస్తాడు. కులం అన్నింటికి మించిన సూపర్ స్ట్రక్చర్ (ఉపరితలం).

1973లో భూ సంస్కరణల చట్టం వచ్చింది. ఇది రావడానికి కారణం వీరోచితంగా జరిగిన భూమి పోరాటాలే. 50 లక్షల ఎకరాలు పంచాల్సి వుండగా, 5 లక్షల ఎకరాలు కూడా పంచలేదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కూడా అంతే. 1959లో పంచాయితీ రాజ్ చట్టం వచ్చింది. సాధారణ బడ్జెట్ నిధులలో 15 శాతం దళితులకు ఖర్చు పెట్టాలి. ఎస్టీలకు 3 శాతం ఖర్చు పెట్టాలి (అప్పుడు ఎస్టీలను బంజారాలలో కలుపలేదు). మహిళలకు 5 శాతం ఖర్చు పెట్టాలి. ఇది 54 సం॥లు వుంది. ఇలా కేటాయించిన ప్రత్యేక నిధులను ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఖర్చు చేయలేదని అధికారికంగా చెప్పగలను. 1978లో దీని గురించి ఒకసారి చర్చకు వచ్చింది. ఇటీవల సంవత్సరాలలో ఆంధ్రలో దీని అమలుకై పోరాటం సాగింది. అరెస్టులు చేశారు. చివరికి సబ్‌ప్లాన్‌ను చట్ట బద్ధం చేయించుకున్నాం. ఇది సరిగ్గా అమలు కావాలంటే పోరాట శక్తులు ఉద్యమించాలి. ఈ చట్టం అన్ని చట్టాలలాగే వుండకూడదంటే, నిరంతరం కళ్లల్లో వత్తులేసుకొని నిఘా వుంచాలి. లేకపోతే సురేష్ కల్మాడీలు (సబ్‌ప్లాన్ నిధులను కామన్‌వెల్త్ క్రీడల పేరుతో బొక్కిన ఘనుడు) పుట్టుకొస్తూనే వుంటారు.

అసమానతలున్నంత కాలం ప్రత్యేక ఆర్థిక, సాంఘిక రక్షణలు కొనసాగించాలి. గ్రామాల్లోని 30 ఎకరాల భూస్వామి, 30 సెంట్లుగల దళితుడూ సమానమా? కాదు. అసమానతలు తొలిగించి, సమానత్వం సాధించడానికి దళితులకూ, మహిళలకు కొన్ని ప్రత్యేక ఆర్థిక సౌకర్యాలు కల్పించాలి. ధనిక వర్గాల బిడ్డలకు రిజర్వేషన్‌లు అవసరం లేదు.

అరవై ఆరు సంవత్సరాలు పాలన చేసి కోట్లాది మంది ప్రజలకు కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం, చిన్నతనం నుండే కాయకష్టం చేసిన వృద్ధులకు పెన్షన్ లేకుండా చేసి, నేడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.జి.ఇ.ఎస్)తెచ్చారు. వీటన్నిటికంటే ఎవరు ఎంత పనిచేస్తే అంత కూలి ఇవ్వండి కనీసం. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి. అన్నింటికి మించి భూమిని పంచండి. అదే పేదలకు, ముఖ్యంగా దళితులకు కూడు, గుడ్డ నిచ్చి, ఆత్మగౌరవాన్ని ఇస్తుంది. అందుకోసం మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు పోరాడాలని వేణుగోపాల్ అన్నారు.





దళితులకు ఉత్పత్తినీ, ఉత్పత్తి సాధనాల పంపిణీయే వారి వర్గ - కుల విముక్తికి నాంది - పి. టాన్యా

మార్క్సిజం పిడివాదంకాదు. అది ఆచరణకు మార్గదర్శి. విప్లవోద్యమం క్రమంలో, అనుభవాల నుండి గుణపాఠాలు తీసుకొని, కులం సమస్యపట్ల సాపేక్షికంగా చూసినప్పుడు, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సిద్ధాంత, రాజకీయ పరంగా ఒక స్పష్టత ఏర్పరచుకున్నది. సమాజంలో ఆధునికత పెరిగినా, కుల వివక్ష, దాడులూ, హత్యాకాండలు పెరుగుతున్న దృష్ట్యా, కుల నిర్మూలనా అవగాహన - ఆచరణాత్మక కార్యక్రమాన్ని గత పదేండ్లుగా పార్టీ చేపట్టింది. వారం రోజుల పాటు ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై, మూడేండ్లుగా పార్టీ వివిధ డిమాండ్లపై పోరాడుతూనే వుంది. దీనిలో భాగంగా ఈ సంవత్సరం సబ్ ప్లాన్ చట్టం నిర్దిష్ట అమలు కోసం పార్టీ ప్రచారాందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న వేణుగోపాల్, లక్ష్మయ్యలు విలువైన సూచనలిచ్చారు.

చారిత్రక భౌతికవాదం జ్ఞానం నిరంతరం సంపద్వంతం అవుతుందని చెబుతుంది. అనుభవం నుండి నేర్చుకొని పొరపాట్లను సరిచేసుకోవచ్చు. తప్పులేదు. అలానే, కుల వ్యతిరేక పోరాటల పట్ల పార్టీకూడా తన కార్యకలాపాలను సంపద్వంతం చేసుకుంది. వర్గ దోపిడీతోపాటు కుల పీడనకు వ్యతిరేకంగా పోరాటాల్ని తీవ్రతరం చేయాలి.

ఒక విప్లవ పార్టీగా అణగారి కులాలు ఎదుర్కొంటున్న రోజువారి కుల సమస్యలపై మొదటి నుండి పోరాడుతూనే వున్నాం. అయితే, కుల సమస్యను రాజకీయ, సిద్ధాంతపరంగా చర్చ, నిర్దిష్ట కార్యక్రమం చేపట్టడంలో వైఫల్యం వుంది. ఈ వైఫల్యం వర్గ పోరాటం చేయడంలో కూడా వుంది. ఫలితంగా పేదలకూ, దళితులకూ అన్యాయం జరిగింది. ప్రజల విముక్తికి ఏది సరైన మార్గం అనే దాంట్లో సాపేక్షికంగా స్పష్టత వచ్చింది. కులం సమస్యపై ఇంకా స్పష్టత రావాల్సిన అవసరం వుంది. కులంపై, జెండర్‌పై స్పష్టత రానప్పుడు, ఆ సమస్యలపై కేంద్రీకరించడంలో లోపం వుంటుంది.

సబ్‌ప్లాన్ నిధులు చట్టబద్ధంగా కేటాయించడంలేదు. కేటాయించినవన్నీ విడుదల చేయడం లేదు. విడుదల చేసిన నిధులను కూడా ఎస్సీ-ఎస్టీలకు ప్రత్యేకంగా ఖర్చు చేయడం లేదు. ఎస్సీ-ఎస్టీల అభివృద్ధి కోసం చట్టాలు రాలేదు. వారిని మభ్యపెట్టడానికే. అ అనుభవం నుండే, సబ్‌ప్లాన్ అమలుకై పోరాడాల్సిన అవసరం వుంది.

దళితుల అభ్యున్నతికోసం అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్‌ల గురించీ, ఆయన ప్రతిపాదనల గురించి, మార్క్సిస్టు - లెనినిస్టులుగా చెప్పుకునే వ్యక్తులు (వి.వి) వక్రీకరించి రాస్తున్నారనీ, లక్ష్మయ్య ఆవేదన చెందడంలో నిజం వుంది. అంబేద్కర్ రిజర్వేషన్‌ల కోసం నిజాయితీగా కృషి చేశాడు. రిజర్వేషన్‌లు ప్రైవేటీకరణవలన నీరుగారి పోతున్నాయి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌ల కోసం పోరాటం చెయ్యాల్సిందే. అంతకంటే ముఖ్యమైంది ప్రైవేటీకరణ వలన రిజర్వేషన్‌ల వల్ల కలుగుతున్న ప్రమాదం గురించి మొత్తం రిజర్వేషన్‌లు అమలైన కాలంతో పోల్చితే, దళితుల అభివృద్ధి తక్కువే. రిజర్వేషన్‌లు అన్ని రంగాలలో ప్రకటించిన మేరకు అమలవుతున్నాయనీ, వార్డు మెంబర్ నుండి రాష్ట్రపతి వరకు దళితులు ఎన్నికవుతున్నారనీ, అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తున్నారనే (వి.వి) రాతలు పాలకవర్గాలపై భ్రమలు పెంచేవే. నేటికీ దళితులు ఎదుర్కొంటున్న వర్గదోపిడీనీ, కుల పీడనను పాలకవర్గ మేధావుల దృష్టితో చూడడమే- కొద్ది మార్పులు వచ్చినప్పటికీ, కుల వివక్ష సారం ఇంకా మనగలుగుతూనే వుందని వీరు గ్రహించడం లేదు.

దళితులకు భూములు పంచినా, కులం నుండి విముక్తి చెందరని కూడా వీరు (వి.వి) రాస్తున్నారు. ఇలా రాయడంలో, భూములు పంపిణీ, పెరుగుతున్న పెట్టుబడిదారీ విధానాన్ని ఆటంకపరుస్తుందనీ, అంతిమంగా సోషలిజం స్థాపనకు ఆటంకాలు ఏర్పడతాయని వీరి వాదన. ఈ వాదన అర్ధవలస - అర్ధ భూస్వామ్య దేశాలకు (భారత దేశం లాంటి దేశాలలో) మావో చూపిన నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గానికి వ్యతిరేకమైనది. పేదలకూ, దళితులకూ దున్నేవానికే భూమి పంపిణీలో భాగంగా భూమి పంచడం ఒక సంస్కరణే, ఆర్థిక పోరాటం. అయినా, ఇది ఉత్పత్తిపై, ఉత్పత్తి సాధనాలపై దోపిడీదారుల అధికారంపోయి, శ్రమ జీవులకు రావడమే. భూమి విముక్తి కావడం, దళితుల ఆత్మగౌరవానికీ భూమికి సంబంధం వుంది. దాడులు చేసిన వారే దళితులను ఆర్థికంగా దిగ్బంధం చేస్తున్నారు. భూమిపై పెత్తనం వల్లనే దళితులపై అన్ని రకాల పెత్తనం చేస్తున్నారు. అందువలన దున్నేవానికే భూమి అంటే, ఉత్పత్తి సాధనాల పంపిణీ అని గుర్తించాలి. ఇప్పటి వరకు అనేక పోరాటాల ఫలితంగా దళితులు పొందిన భూములు 50 శాతం పరాయీకరణ చెందాయి.

భూమి పంపిణీకీ, నిజ జీవితంలో దళితులు ఆత్మగౌరవంతో బతకడానికీ సంబంధం వుంది. ఈ సంబంధం కుల విముక్తి పోరాటాలు నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాలలో భాగంగా చేపట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. అగ్రకుల పెత్తందారులు వర్గదోపిడీనీ, కుల అణచివేతను కొనసాగించడానికీ ఐక్యం అవుతున్నారు. శ్రామిక, దళిత శక్తులు తమ పోరాటంలో గెలవాలంటే చీలిపోకుండా, ఐక్యం కావాలని కా॥ టాన్యా పిలుపునిచ్చారు.

హిందూ సమాజం ఒక్కసారి కూడా క్షమాపణ చెప్పలేదు.

- మల్లేపల్లి లక్ష్మయ్య

కుల అణచివేతకు వ్యతిరేకంగా సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కార్యక్రమం చేపట్టినందుకు అభినందనలు. మన ముందు మాట్లాడిన కె.ఆర్. వేణుగోపాల్ తన సర్వీసు కాలమంతా దళితుల అభివృద్ధికే కృషి చేశారు. కష్టా జిల్లా కలెక్టర్‌గా వున్నప్పుడు దళితులకు చట్టపరంగా భూమి పంచితే, ప్రభుత్వం కేసుపెట్టింది.

అమెరికా అధ్యక్షుడు జపాన్ వెళితే, హిరోషిమా వెళ్ళి క్షమించమని ఆ జాతి ప్రజలను అడుగుతాడు. భారత ప్రధాని అమృత్‌సర్ వెళ్ళినా అంతే. అయితే, తరతరాల నుండి కులం పేరుతో దళితులను అమానుషంగా అణచివేసినందుకు హిందూ సమాజం ఒక్కసారి కూడా క్షమాపణ చెప్పలేదు. వర్గ పోరాటాలన్నీ ప్రజాస్వామ్య మద్ధతుతోనే ముందుకు వెళతాయి.

వర్గపోరాటాలే ప్రపంచ చరిత్ర అని కారల్‌మార్క్స్ అన్న సూత్రీకరణను భారత్‌కు అన్వయించుకుంటే, హిందూ మతానికి - బౌద్ధానికి జరిగిన ఘర్షణే భారత చరిత్రగా అనుకోవచ్చు. కుల వ్యతిరేక పోరాటం చేయాలనుకునే కార్యకర్తలంతా జ్యోతిబాపూలే రచించిన సేద్యగాని చెర్నకోలా, గులాంగిరి పుస్తకాలు చదవాలి. మార్క్స్ రాసిన చారిత్రక భౌతికవాదాన్ని భారత సమాజానికి సరిగ్గా అన్వయించాలి. అంబేద్కర్ కులంపై చేసిన పోరాటాల్ని, రచనలను అధ్యయనం చేయాలి.

ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్ తయారు కావడంలో నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల ప్రభావాలున్నాయి. ప్రభుత్వ బడ్జెట్‌లో కాయకష్టం చేసేవారు చెల్లించే పరోక్షపన్నులే అత్యధికం. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కోటి అరవై లక్షల కోట్లు. వీటిలో జనాభా దామాషా ప్రకారం సబ్‌ప్లాన్ కింద కేటాయించే నిధులు, ప్రభుత్వం దయాదాక్షిణ్యంగా ఇచ్చేవి కావు. వారి సంపదనే వారికి తిరిగి ఇస్తుంది. పోరాట పార్టీలు కూడా సబ్‌ప్లాన్‌ను ఖచ్చితంగా అమలు చేయమని పోరాటాలు చేయాలని, అలా చేయకపోతే, సబ్‌ప్లాన్ నిధులూ ప్రక్కమార్గం పట్టే అవకాశాలున్నాయని లక్ష్మయ్య అన్నారు.

నేటికీ కులం ఒక వాస్తవం. మిధ్య కాదు!

- డాక్టర్ కొండా నాగేశ్వరరావు

కుల అణచివేత వలన, కుల సంబంధాలు కొనసాగడం వలన చరిత్రపొడవునా లబ్ధి పొందుతున్నవారు నేడు కులం ఒక మిధ్య అని ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని విప్లవ శక్తులూ, ప్రజాస్వామిక శక్తులు తిప్పికొట్టాలి. కులం, కుల వివక్ష, కుల అణచివేత ఒక వాస్తవమని చాటి, దానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోఆరడాలి. తల్లి గర్భం నుండి సమాధి వరకు నేటికీ అణగారిన కులాల ప్రజలను కులం వెంటాడుతుంది. ఒకవైపు హిందూత్వ మోడీ, ఇంకోవైపు ఆర్థిక, సాంఘిక క్లిష్ట పరిస్థితులు మనముందున్నాయి. వీటిని ఎదుర్కొనడానికి మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు తప్ప వేరే మార్గమేలేదని కొండా నాగేశ్వర్రావ్ అన్నారు.

బ్రాహ్మణీయ భావజాలంపై పోరాడండి! - కోట రాజేష్

భారత సమాజాన్ని మార్చాలంటే, వర్గ దృష్టితోనే కాకుండా, కుల దృష్టితో కూడా పరిశీలించి, కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. అంబేద్కర్‌తోపాటు చరిత్రలో ఎందరో కులానికి వ్యతిరేకంగా వివిధ రకాలుగా పోరాడుతూనే వున్నారు. ఆ పోరాటాలను అధ్యయనం చేయాలి. వర్తమానంలో మనం చేసే పోరాటాలను సరైన మార్గదర్శంలో నడిపి, అన్ని మూలల నుండి కులంపై, దానిని కాపాడుతున్న ఉత్పత్తి సంబంధాలపై, బ్రాహ్మణీయ భావజాలంపై దెబ్బకొట్టాలి. అప్పుడే అమానుషమైన కుల వ్యవస్థ కూలిపోతుందని రాజేష్ అన్నారు.

ఇంకా ఈ సదస్సులో సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, పివోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు వి. సంధ్య, పీడీయస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.ఎస్. సాగర్, పీడీయస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, పీడీయస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.డి. రాము మాట్లాడారు.

సదస్సులో కుల వివక్షపై, అణచివేతపై, కుల వ్యతిరేక పోరాటాలపై అరుణోదయ కళాకారులు వేణు, నిర్మల, ఉపేందర్, మురళి, పాపన్న, రవి, అనిత, శ్రీశైలం, హరీష్‌లు పాటలు పాడారు. కళాకారులు పాడిన పాటలు సభికులను ఆలోచింపచేశాయి. సదస్సుకు రాష్ట్ర వ్యాపితంగా కార్యకర్తలు హాజరైనారు.

- ప్రజాపంథా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో కామ్రేడ్ మావో 37వ వర్ధంతి సభ

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కా॥ మావో 37వ వర్ధంతి సభను డివిజన్ కేంద్రమైన గురజాల పట్టణంలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్మించిన కా॥ వెంకట్రావ్‌నగర్‌లో 150 మందితో జరిగింది. ఈ సెప్టెంబర్ 9న సభకు వెంకట్రావ్ నగర్ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.కె. నభి అధ్యక్షత వహించారు.

ఈ సభలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎన్. బ్రహ్మయ్య ప్రసంగిస్తూ కా॥ మావో జీవిత ప్రస్థానాన్ని వివరించారు. చైనాకు భారతదేశానికీ భౌగోళికంగా చాలా విషయాలలో పోలికలు వున్నాయన్నారు. పీడిత ప్రజల సమస్యలను ప్రజల దగ్గర నేర్చుకొని వారికోసం పోరాడాలన్నారు. అంతేకాకుండా కమ్యూనిస్టు పార్టీలోని రివిజనిస్టులకు, మితవాదులకు వ్యతిరేకంగా చైనాలో "గ్రేట్ డిబేట్" నిర్వహించారన్నారు. ప్రజలను చైతన్యం చేయటానికి కా॥ మావో ఎనలేని కృషి చేయుటకు "ఆచరణ", "ప్రజల మధ్య వైరుధ్యాలు" అనే గొప్ప రచనలు చేశారన్నారు. కా॥ మావో ఆలోచనా వెలుగులో మనందరం ప్రయాణించాలని కోరారు. సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా గురజాలలో ప్రదర్శన

అధిక ధరలకు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 16.09.2013న గుంటూరు జిల్లాలోని గురజాలలో అఖిల భారత రైతు - కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) ఆధ్వర్యంలో రైతు-కూలీలతో ప్రదర్శన జరిగింది. అనంతరం గురజాల బ్రహ్మనాయుడు బొమ్మ సెంటర్‌లో యూపీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయటం జరిగింది.

ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ నాదెండ్ల బ్రహ్మయ్య మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా రూపాయి విలువ పతనం కావటంతో ప్రజలపై పెను భారాలు పడుతున్నాయన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఎరువుల ధరలు పెంచి రైతు నడ్డి విరిచారన్నారు.

ప్రజల నిత్యావసర వస్తువులైన కూరగాయల ధరల్ని సైతం విపరీతంగా పెంచారు. దీనికి తోడు పెట్రోలు, డీజిల్ ధరలు మళ్ళీ పెంచారు. పైగా కిరోసిన్, గ్యాస్ ధరలు మరింత పెరగాలంటున్నారు. ప్రభుత్వం అధిక ధరలను అరికట్టాలని కోరారు.

ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు ఉన్నం నరసింహారావు, ఎస్.కె. నభి, వల్లెపు రాములు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు కత్తి జానమ్మ, రమాదేవి, పివోడబ్ల్యూ పల్నాడు డివిజన్ కార్యదర్శి ఎన్. సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

భూ సంస్కరణల జాతీయ విధానం ముసాయిదా లక్ష్యం...

సమగ్ర భూవినియోగం పేరుతో పేదలకు భూవియోగం!

కార్పొరేట్ శక్తులకు కష్టం లేకుండా భూమి కట్టబెట్టటమే!!

బ్రిటిష్ వలస పాలన హయాంలో భారతదేశ ఫ్యూడల్ వ్యవస్థ వలస - అర్ధ ఫ్యూడల్ వ్యవస్థగా మారింది. అధికార మార్పిడి తర్వాత అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థగా మారింది. 66 సం॥ల తర్వాత నేటికీ కొద్ది మార్పులు జరిగినప్పటికీ ప్రధానంగా యిది అర్ధ భూస్వామ్య వ్యవస్థగానే కొనసాగుతోంది. ఇది వ్యవసాయిక దేశం. అధికార మార్పిడి నాటికి భారతదేశ జనాభాలో 80% ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివశిస్తుండేవారు. నేటికీ పట్టణ జనాభా కొద్దిమాత్రం పెరిగినప్పటికీ 70% మంది గ్రామీణ ప్రాంతాల్లోనే బ్రతుకు లీడుస్తున్నారు. మూడింట రెండువంతుల మంది జనాభాకు వ్యవసాయరంగమే వుపాధి కల్పిస్తోంది. ఈ గ్రామీణ ప్రజల జీవన పరిస్థితి మెరుగుదలను భూమి సమస్యను ప్రక్కకుబెట్టి చూడలేం. జాతీయోద్యమ కాలంలో రైతాంగం కీలకపాత్ర పోషించింది. రైతాంగం భూమికోసం తెభాగా, పాటియాలా, పున్నప్రా, వాయిలార్, నారాయణ్‌పూర్, లఖింఖేరి, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం వంటివి నిర్వహించింది. ఆదివాసీలు, రైతాంగం జరిపిన పోరాటాల్లో భారత గ్రామీణ ప్రజల భూదాహం "పూసలో దారంవలె" అంతర్లీనంగా వుంటూ వస్తున్నది. పాలకవర్గాలు అందుకే కాగితాలపైనే అయినా భూ సంస్కరణలు చేయక తప్పని సరయ్యింది.

అందులో భాగంగానే 1950, 1960లలో తొలిదశ, మలిదశ భూ సంస్కరణలు చేశారు. భూమి గ్రామీణ ప్రజలకు ఎన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ శాశ్వత ఉపాధి , ఉపాధి భద్రత, సామాజిక హోదా, సమానత్వ అవకాశాలను కల్పిస్తుంది. మొదటి దశలో జమీందారీలను రద్దుచేసిన పాలకులు యింకా భూస్వాములకు వందలాది ఎకరాలు వదిలారు. మలిదశలో భూగరిష్ఠ పరిమితి చట్టాలు, కౌల్దారీ చట్టాలూ ఆమోదించారు. కాని భూస్వామ్య, బూర్జువా వర్గాల ప్రతినిధులైన పాలకులు చట్టాలలో లోపాలను బుద్ధిపూర్వకంగానే వుంచారు. నక్సల్‌బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల మూలంగా 1973లో రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం చేశారు. భూస్వాములకు అనేక మినహాయింపులు, రాయితీలు యిచ్చారు. 1973 జనవరిలో మరో చట్టం చేశారు. దీని ప్రకారం 1.1.1975 నుండి అమలు చేయాలని నిర్ణయించింది. ఫలితంగా బినామీ పేర్లతో, రకరకాల కుయుక్తులతో చట్టం ప్రకారం మిగులు భూములను అప్పగించకుండా స్వల్ప మోతాదులో నాసిరకం భూములనప్పగించారు. భూమి సమస్య పరిష్కారం కాలేదు. ఈ పరిస్థితిలో 1982 సం॥లో సుప్రీంకోర్టు ఒక కేసు తీర్పులో భూగరిష్ఠ పరిమితి యింకా కుదించాలని, చట్టంలో భూస్వాములకు యిచ్చిన మినహాయింపులు రద్దు చేయాలని, తెల్లకాగితాల మీద మార్పిడిలు చెల్లవని చెప్పింది. ఏ రకం భూములు ఏ మేరకు అందుబాటులో వున్నాయో చెబుతూ వాటిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని చెప్పింది. మూడు దశాబ్దాలు దాటిపోయినా ప్రభుత్వం నేటికీ ఆపని చేయలేకపోయింది. సామ్రాజ్యవాదుల, ప్రపంచ బ్యాంకు ఆదేశాల ప్రకారం నడుస్తూవుంది. అవసరం కొద్దీ అభిప్రాయాలు మార్చుతూవుంది. నేడు భారతదేశంలో భూమిహీనుల సంఖ్య ప్రపంచంలో కంటె ఎక్కువ వున్నదని, భూ పంపిణీయే దానికి పరిష్కారమని కన్నీరు కారుస్తోంది. 30 సం॥లకుపైగా మౌనంగా వున్న పాలకులు యిప్పుడు జాతీయ భూవినియోగ ప్రణాళికలు, భూవిధానం పేరుతో ముసాయిదా ఎందుకు విడుదల చేశారో మనం అర్ధం చేసుకోవలసి వున్నది.

ఒకప్పుడు భూసంస్కరణలను రాష్ట్రాల ఏజెండాకు కేటాయించింది. ప్రస్తుతం జాతీయ విధానం రూపొందించాలంటున్నది. మొదట్లో వ్యవసాయ క్షేత్రాలను సంఘటితం చేయాలని, భారీ వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటు చేయాలని చెప్పింది. సామ్రాజ్యవాదులు తమ వ్యవసాయ ఉపకరణాలు అమ్ముకునేందుకు భారతదేశంలో పైరుపచ్చ విప్లవం పేరుతో సాంద్ర వ్యవసాయ పథకం (గ్రీన్ రివల్యూషన్) అమలు జరిపించింది. దున్నేవానికి భూమి రాలేదు సరికదా, భూమిహీనులకు కూలికూడా లేకుండా పోయింది. ఆ వ్యవసాయం కూడా సంక్షోభంలో పడింది. దానితో ప్రపంచబ్యాంకు ప్లేటు మార్చి చిన్నప్లాట్లు ఉత్పత్తిదాయకమనే పాట మొదలు పెట్టింది. భూమిహీనుల భూదాహం చల్లార్చేందుకు, భూస్వాములకు నష్టం రాకుండా వుండేందుకు పెరటిప్లాట్లు, చిన్న క్షేత్రాలు అవసరమని ప్రచారం చేసింది. మారిన పరిస్థితుల్లో సామ్రాజ్యవాదం ఒకవైపు వెనుకబడిన మూడో ప్రపంచ దేశాలపై దురాక్రమణలు, జోక్యందారీ పద్ధతులు అనుసరిస్తూనే మరోవైపు ప్రపంచీకరణ నినాదంతో వెనుకబడిన దేశాలలో బహుళజాతి సంస్థల ద్వారా దోపిడీ ప్రారంభించింది. ప్రపంచబ్యాంకు, సామ్రాజ్యవాదుల సలహాతోనే పాలకులు 'అభివృద్ధి' పేరుతో ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్‌లు), పెట్టుబడి మండలాలు (సిజ్‌లు), మాన్యుఫ్యాకర్చరింగ్ మండాలు (ఎస్.ఎం.జడ్). ప్రారంభించాయి. ఖనిజ వనరుల వెలికితీత ప్రారంభించాయి. వాటికోసం పెట్టుబడి ప్రాధమిక సమీకరణ కోసం భూమిపై దృష్టిసారించి పెద్దఎత్తున బలాత్కారంగా రైతాంగం ముఖ్యంగా చిన్న-సన్నకారు క్షేత్రాలను డి.ఫారం భూములను దేశ-విదేశ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టటం సాగించింది. భూమిహీనులకు భూముల పంపిణీ, భూసంస్కరణల అమలు వదిలేసి వున్న భూములను స్వాధీనం చేసుకోవటంతో భూమిహీనుల సంఖ్యను పెంచుతున్నది. s ని ౨ సంవత్సరాల క్రిందట పెద్ద భూకమతాలు అవసరమనీ, భూసంస్కరణలు రద్దుచేయాలనీ రివర్స్ భూసంస్కరణల్ని ప్రతిపాదించారు.

సహజంగానే విప్లవ వారసత్వం గల భారత రైతాంగం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా భూమిపై తమ హక్కుల కోసం వుద్యమిస్తోంది. దేశవ్యాపితంగా హర్యానా, యు.పి., బెంగాల్, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో రైతాంగం చావుకు తెగించి పోరాడుతున్నారు. డజన్లకొలది ఆహుతయ్యారు. దానితో ఆమోదించిన సెజ్‌లు, ప్రమాదకర పరిశ్రమలు, ఖనిజవనరుల వెలికితీత ముందుకు సాగకుండా ఆటంకం ఏర్పడింది. భూసేకరణ రాష్ట్రాలకు వదిలినప్పటికీ, అవి నిర్వాసితులను కాల్పులు జరిపి పొట్టన బెట్టుకున్నప్పటికీ వాటిని ప్రారంభించలేకుండా వున్నాయి. సామ్రాజ్య వాదం, ప్రపంచ బ్యాంకు, కార్పొరేట్ శక్తుల ఒత్తిడి పెరిగింది. అందుకే భూసేకరణను సెజ్‌ల యజమానులు జరపటం గాకుండా ప్రభుత్వమే నేరుగా వాటికి సహాయపడేందుకుగాను భూసంస్కరణల చట్ట సవరణ నాటకంతో ప్రభుత్వం ముందుకు వచ్చింది: భూవినియోగ అవసరం పెరిగింది : ఆ కారణంగా భూమి బ్యాంకుల ఏర్పాటు నినాదంతో ప్రస్తుతం జాతీయ భూ విధానం ముందుకు వచ్చింది. ముసాయిదా విడుదల చేసింది. ఇది భూమిహీనుల ప్రయోజనాల కోసం గాదు. సెజ్‌ల యజమానులకు యిబ్బందులు కలుగకుండా చేసేందుకు ఆడుతున్న జగన్నాటకం! ముసాయిదా మాటల్లోనే చూద్దాం.

"ఇటీవల భూవినియోగంలో వచ్చిన మార్పులు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి; ఇంతకు ముందుకంటె యిప్పుడు భూసంస్కరణల ఆవశ్యకత పెరుగుతోంది. వ్యవసాయ భూమి వ్యవసాయేతర అవసరాలకు మళ్ళింపబడుతోంది. వ్యవసాయ దిగుబడులు పెరగటం లేదు. చిన్న వ్యవసాయ క్షేత్రాలు ప్రయోజనకరమని అనుభవాలు చెబుతున్నాయి; భూసమస్యను పూర్తిగా తిరిగి సమీక్షించవలసిన అవసరాన్ని చాటుతున్నాయి". ఇక వ్యాఖ్య అవసరం లేదు! దానికి తగినట్లుగానే ముసాయిదాలో పేర్కొన్నది.

ఇబ్బడి ముబ్బడిగా ప్రణాళికలు :

"భూ సమస్య పరిష్కారానికి ముందుకంటె యిప్పుడు జాతీయ భూవిధానం ఆవశ్యకత ఎక్కువగా వుంది. ఈ విధానం మండల, జిల్లా, ప్రాంతీయ, రాష్ట్రస్థాయి మాస్టర్ ప్రణాళికలపై ఆధారపడి వుంటుంది; ఈ ప్రణాళికల్లో వ్యవసాయానికి పనికిరాని భూమిని స్పష్టంగా గుర్తిస్తారు; అటువంటి భూమిని పారిశ్రామిక, వ్యవసాయేతర వినియోగానికి కేటాయిస్తారు". అంటే నేరుగా రైతుల నుండి సెజ్ యజమానులు భూసేకరణ చేయవలసిన అవసరం లేకుండా ప్రభుత్వమే భూమి కూడబెట్టి సహాయపడుతుంది.

భారతదేశంలో 47% భూమి వుపయోగంలో వుండగా, సాగుకు అనుకూలమైన బంజరు భూమి 5.1%, పథావు భూమి 8.2% వుందని ప్రభుత్వమే లెక్కలు చెబుతున్నది. భూమిహీనులు, నామమాత్రపు భూమిగలవారు 60% పైగా వున్నారని చెబుతోంది. వీరి చేతులో 5% మాత్రమే భూమి వుండగా 10% మంది చేతిలో 55% భూమి వుందని చెబుతోంది. కాని సుప్రీంకోర్టు గతంలో "ఇంకా దేశంలో 5కోట్ల ఎకరాల బంజరు భూములున్నాయని, ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే 4.5లక్షల దేవాదాయ భూములు, 8లక్షల ఎకరాలు బినామి భూములున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. భూ గరిష్ట పరిమితికి మించి భూస్వాముల వద్ద ఇప్పటికి 83.12లక్షల హెక్టార్ల మిగులు భూమి ఉన్నదని "వరల్డ్ అగ్రికల్చరల్ సెన్సెస్" ప్రకటించింది". గ్రామస్థాయి భూవినియోగ ప్రణాళికలు తయారుచేసి పై స్థాయిలో మదింపు వేస్తామని చెబుతున్నారు. అన్యాక్రాంత భూములను తిరిగి స్వాధీనం చేస్తామని చెబుతున్నారు. ఎస్.సి, ఎస్.టి.ల భూములకు రక్షణ కల్పిస్తామంటున్నారు.

"రాష్ట్రాల ప్రణాళికలు, అభివృద్ధి ప్రణాళికలను సమన్వయం చేయటం ద్వారా సమగ్ర జాతీయ భూమి వినియోగ ప్రణాళికను తయారు చేస్తామంటున్నారు. దీని ద్వారా దేశ అభివృద్ధి అవసరాలను పరిగణన తీసుకోవటమే గాక భూమిని అత్యుత్తమ వినియోగానికి కేటాయించటానికి వీలవుతుందంటున్నారు". దీనర్థం స్పష్టమే. 'అభివృద్ధి అవసరాలంటే' పాలకుల దృష్టిలో ప్రధానంగా దేశ-విదేశ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు - 'అత్యుత్తమ వినియోగం' అంటే వాటికి భూములు కేటాయింపే.

భూమిలేని పేదలకు పంపిణీ చేసిన అస్సైన్‌మెంట్ భూములు లబ్దిదారులకు సక్రమంగా దఖలు పర్చకపోవటం, అన్యాక్రాంతం జరగటంవల్ల అనుభవించలేకపోతున్నారంటున్నది. యికముందైనా ఈ సమస్యకు పరిష్కారమార్గాలేమిటో ముసాయిదాలో పేర్కొనలేదు.

భూమి బ్యాంకులు : వాటికి భూమి సేకరణ :

"ఒక గ్రామం లేదా కొన్ని గ్రామాలను కలిపి ఒక భూ బ్యాంకును ఏర్పాటు చేయాలి; వెంటనే ఆ భూమిని నివాసాలకు లేదా వ్యవసాయానికి వుపయోగించాలి" అని ముసాయిదా చెబుతోంది. ఇది కొత్తదేమీ కాదు. ఏజెన్సీలో గ్రామకంఠం భూమి అలాంటిదే. కొత్తగా పెరిగిన కుటుంబాలకు నివాసాలకు కేటాయించేందుకు యిది రిజర్వు చేయబడుతుండేది. గ్రామకంఠం భూమి, గ్రామకంఠం చింతలు" "గ్రామంకంఠం భూమి" అంటూ సమిష్టి సంపద, వుపయోగం వుండేది. అసలు సమస్య అదికాదు. ఈ భూ బ్యాంకుకు భూములు ఎక్కడ నుండి సేకరిస్తారో చూస్తే అసలు విషయం అర్థం అవుతుంది.

భూమి బ్యాంకు పరిధిలోనికి వచ్చే భూములు : (ఎ) చట్ట విరుద్ధంగా ఆక్రమించిన, యితర వ్యవసాయ బంజర్లు (బి) పరిశ్రమల కోసం సేకరించిన, కొనుగోలు చేసిన లేదా అద్దెకిచ్చిన భూములు (సి) అభివృద్ధి, ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు దానికోసం వుపయోగింప బడకుండా వుంటే వాటిని తిరిగి పాతవాళ్ళకు చెందేలా స్వాధీనం చేయటం (డి) అక్రమ ఆక్రమణలుంటే వాటిని తొలగించి భూపరిమితి చట్టం క్రింద లభించిన మిగులు భూమి (ఇ) అక్రమ ఆక్రమణల క్రిందనున్న భూదాన భూములు (ఎఫ్) అటవీ-రెవెన్యూ భూముల మధ్య వివాదాన్ని పరిష్కరించి రికార్డులు సరిజేయటం ద్వారా లభించిన భూములు (జి) తమిళనాడులో పంచామీ భూములు / ఆంధ్రప్రదేశ్‌లో అస్సైన్‌మెంట్ భూములు / మహారాష్ట్రలో గైరాన్‌భూముల దురాక్రమణ తొలగించి ఆ భూములను భూ బ్యాంకులో వుంచాలి.

ఇందులో ప్రమాదకరమైన అంశాలున్నాయి. చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భూములని పేర్కొనటం అంటే పేద ప్రజలు ఐక్యంగా స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్న భూములను కూడా అక్రమ ఆక్రమణలుగా పరిగణించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూ బ్యాంకులో కలుపుకునే ప్రమాదం వుంది. భూమిలేని వాళ్ళకు భూమి పంపిణీ చేయటంలో ప్రభుత్వాలు విఫలమైన కారణంగా అన్యాక్రాంత భూములు, అటవీ భూములు, ప్రభుత్వ బంజర్లు పేదలు స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నారు. వ్యాపారం కోసం, లాభార్జన కోసం కాదు. వాటిని దురాక్రమణలుగా ఎంతమాత్రం పేర్కొనకూడదు. వాళ్ళకు ఆ భూములను క్రమబద్ధం చేసి శాశ్వత పట్టాలిచ్చి హక్కు కల్పించాలి. ధనవంతులు, దోపిడీదారులు, భూస్వాములు, పెత్తందార్లు దురాక్రమణ చేసిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అది కూడా వాళ్ళకు ఆ భూములకు డబ్బులిచ్చి కొనుగోలు చేయకూడదు. అలాగే అన్యాక్రాంతమైన పేదల అస్సైన్‌మెంట్ భూములు, భూదాన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి పూర్వపు లబ్దిదారులకు అప్పగించాలి. అంతేగాని భూమి బ్యాంకులో వుంచి 'యితర' పనులకు వుపయోగించరాదు. ప్రభుత్వ సిబ్బంది ఈ విషయంలో ధనవంతులైన అక్రమార్కులను వదిలి పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రమాదం వుంది. ఇప్పటికే తాజాగా ఉభయ గోదావరి పోలవరం, సింగరేణిలో నష్టపోయే అడవులకు బదులు ప్రత్యామ్నాయ అడవుల పెంపకం పేరుతో ఆదివాసీల సాగులోని పోడు భూములను ప్రభుత్వం రిజర్వు అడవుల్లో కలిపి వేసుకునే కుట్రలు చేస్తున్నది. ఖమ్మం జిల్లా అటవీ ప్రాంతంలో దశాబ్దాలుగా ఆదివాసీలు సాగుచేసుకుని అనుభవిస్తున్న పోడు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం, తగులబెట్టటం చేస్తున్నది. ఇలాగే జరిగితే ప్రభుత్వం ఆదివాసీల ప్రతిఘటనను చవిచూడకతప్పదు. ఆదివాసీల సాగులో వున్న భూములన్నింటికి శాశ్వత హక్కు కల్పించాలి.

విజయవాడలో జరిగిన "కేంద్ర భూసంస్కరణల చట్టం ముసాయిదా" పై రాష్ట్ర సదస్సు

14.09.2013న విజయవాడ నగరంలోని హనుమంతరాయ గ్రంధాలయం హాలులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన భూ సంస్కరణల చట్టం ముసాయిదాపై అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.

ఈ సదస్సుకు ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ పి. టాన్యా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి ప్రసంగిస్తూ ఒకవైపు భూ సేకరణ బిల్లును కేంద్ర పార్లమెంటులో ఆమోదింపచేసి సెజ్‌లు, కారిడార్‌లకు భూముల నుండి రైతాంగాన్ని బేధఖలు చేస్తూ చట్ట రూపం చేసిన యుపిఎ-2 ప్రభుత్వం మరోవైపు పేదలకు భూమిలేని నిరుపేదలకు భూమిని పంచుతామంటూ దున్నేవానికే భూమి నినాదంతో ముందుకు రావడం హాస్యాస్పదంగా వుందని, ఈనాటకం అంతా 2014లో జరగబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఆడుతుందని, అందువలన ఈ ముసాయిదాను ఆహ్వానిస్తూనే, అదే సందర్భంలో ఈ ముసాయిదాలోని పేదలకు వ్యతిరేకమైన వాటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ పి. టాన్యా "కేంద్ర ప్రభుత్వ భూసంస్కరణల చట్టం ముసాయిదా"పై కీ నోట్‌ను ప్రవేశపెడుతూ ఈ భూ సంస్కరణల చట్టం ముసాయిదా తేనెపూసిన కత్తిలాగా వుందని, భూ బ్యాంకుల పేరుతో గ్రామీణ ప్రాంతాలలో భూమిని సేకరించి బూర్జువావర్గాలకు, పారిశ్రామిక అధిపతులకు ప్రజా ప్రయోజనాల పేరుతో తాకట్టు పెట్టేందుకు సిద్దం చేసిందన్నారు. 1973 భూ సంస్కరణల చట్టం దేశంలోను, రాష్ట్రంలోను అమలు కాలేదు. బీడు భూములను, పడావుపడ్డ భూములను పేదలకు పంపిణీ చేసిందనీ 1982లో సుప్రీంకోర్టు భూ సంస్కరణల చట్టంలో భూ పరిమితిని సవరించాలని చెప్పినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కాని నేడు ఒకవైపు రైతాంగాన్ని భూమి నుండి తరిమివేస్తూ మరో వైపు భూమిని నిరుపేదలకు పంచుతామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని దీనిని ప్రజల్లో బహిర్గతం చేస్తూ పోరాడాలని, భూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సదస్సులో ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కా॥ చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముసాయిదా ఎంతో ప్రగతిశీలకంగా వున్నా దాని వెనుకదాగి వున్న కుట్రను, ప్రజలను మోసం చేయటానికి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చారని అందువలన ఈ ముసాయిదాని విమర్శనాత్మక దృష్టితో చూడాలని పిలుపునిచ్చారని అందువలన ఈ ముసాయిదాని విమర్శనాత్మక దృష్టితో చూడాలని పిలుపునిచ్చారు.

ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు కా॥ రాజారావు ముసాయిదాపై తీర్మానం ప్రవేశపెట్టారు. చివరిగా సదస్సులో ఎఐకెఎంఎస్ రాష్ట్ర కోశాధికారి కా॥ మండల వెంకన్న మాట్లాడారు. సదస్సును జయప్రదం చేసినందుకు వచ్చిన రైతు-కూలీ కార్యకర్తలకు విప్లవాభినందనలు తెలియజేశారు. అరుణోదయ కళాకారుల పాటలు, నృత్యాలు సభికులను ఆకర్షించాయి.

భూ పరిమితి చట్టాల వుల్లంఘనకు భూస్వాములకు పాలకులే అవకాశం కల్పించారు :

ఇంతకుముందు ప్రభుత్వం చేసిన భూపరిమితి చట్టాలు కూడా అమలు జరగలేదు. చట్టం చేసేముందు సం॥రం పూర్వమే ప్రభుత్వం ప్రకటన చేయటంతో భూస్వాములు బినామీ పేర్లతో రిజిష్టరు చేసి అదనపు భూమి నాసిరకం నామమాత్రంగా చూపించారు. ప్రకటన చేసిన తరువాత కూడా ప్రభుత్వానికి అప్పగించిన అదనపు భూమిని ఇతరులకు అమ్ముకున్నారు. వాటి స్వాధీనానికి ఇది అడ్డుగా తయారయ్యింది.

ఇంకా పంచకుండా వున్న భూదాన భూముల సర్వే ఒక సం॥రం లోపల పూర్తిచేయాలని చెప్పడం అంటే అది మరింత జాప్యానికి దారి తీస్తుంది. ఈ సర్వే గ్రామ పంచాయితీలు, స్వచ్ఛంద సంస్థలు (సివిల్ సొసైటీలు), స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయాలని మాత్రమే ముసాయిదా చెప్పింది. అంతేగాకుండా దీనికి రాజకీయ పార్టీలు ముఖ్యంగా విప్లవ సంస్థలు, ప్రజా సంఘాలను కూడా జతచేయాలి. లబ్దిదారులు సద్వినియోగం చేయటం లేదని తెలిస్తే దాన్ని స్వాధీనం చేసుకోవాలని చెప్పింది. అలా కాకుండా పేదలు ఎందుకు ఉపయోగించటం లేదో పరిశీలన చేయాలి. వాళ్ళు దాన్ని సద్విని యోగానికి తేవడానికి అవసరమైన సహకారం అందించాలి. లబ్దిదారుల భూమిని అన్యాక్రాంతం చేసిన వారి నుండి స్వాధీనం చేసుకోవాలి. దాతలు దానం యిచ్చిన భూమిని మోసంతో తిరిగి ఆ భూమిని అమ్ముకుని ఉంటే కొనుగోలు చేసినవారు పేదవారైతే తప్ప, ధనవంతులైతే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలి. ఆ భూమిని లబ్దిదారులకు, వాళ్ళు జీవించి ఉండకపోతే భూమిలేని వారికి పంపిణీ చేయాలి.

దేశంలో 12.5 కోట్ల ఎకరాల బంజరు భూములున్నాయని ముసాయిదానే చెబుతోంది.

అన్నీ వుండి భూమిలేని శ్రమజీవులు ఆకలితో ఎందుకు అలమటించాలి? వాటిని తప్పక భూమిలేని పేదలకు అందునా ఎస్‌సి, ఎస్‌టిలకు మొదటి ప్రాధాన్యత యిస్తూ పంపిణీ చేయాలి. ప్రజా ప్రయోజనాల పేరిట ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు ('అభివృద్ధి' కార్యక్రమాలకు) సాగుకు యోగ్యమైన బంజరు భూములను సేకరణ, అమ్మకం లేదా లీజుకివ్వడం చేయరాదు. సాగుకు యోగ్యంకాని భూములను మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు లేదా పరిశ్రమలకు వినియోగించాలి. అలాంటి భూమి లేనట్లయితే అలాంటి భూములు వున్నచోటనే ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ప్రభుత్వ - ప్రైయివేట్ సంస్థలకు కేటాయించిన భూములు ఐదు ఏండ్లు గడిచిపోయి వాటిని వుపయోగించకపోతే వాటి యజమానులు చిన్న - సన్నకారు రైతులయినట్లయితే వాళ్ళకు తిరిగి అప్పగించాలి. కాని ధనికరైతులు, భూస్వాములు, స్థానికంగా నివాసం వుండని యజమానులు అప్పటికే నష్టపరిహారం తీసుకుని వుంటారు గనుక వాళ్ళకు తిరిగి అప్పగించరాదు; భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలకు ఆ భూమిని పంపిణీ చేయాలి. ఆ భూములను తిరిగి భూమి బ్యాంకులో కలపవద్దు. లక్ష్మింపేట దళితులకు వాళ్ళు సాగుచేస్తున్న ప్రభుత్వ భూమిని యివ్వకుండా భూ బ్యాంకులో జమచేసి వేరే భూమినిస్తామనటం సరికాదు.

దేవాదాయ, ధర్మాదాయ, సత్రం భూములు :

అంగవికలురు, కుష్టురోగులు వంటి వారి సంక్షేమం కోసం కేటాయించిన సత్రం భూములయితే దానికే వుపయోగించాలి. కాని సెక్యులర్ రాజ్యం అని చెప్పుకుంటున్న పాలకులు కొన్ని మతాలు - ముఖ్యంగా హిందూ దేవాలయాల పేరిట పెద్ద ఎత్తున భూములు నిర్వహించటం సరికాదు. శాస్త్రీయమైన ఆలోచన లేకుండా ప్రాణమున్న శ్రమజీవులను ఆకలిబారిన వదిలి ఛాందసవాదంతో విగ్రహపూజలకు, నైవేద్యాల పేరిట పెద్ద ఎత్తున భూములను కేటాయించటం సరికాదు. వ్యక్తుల మత భావాలకు స్వేచ్ఛ వుందనుకున్నప్పటికీ నైవేద్యాల పేరిట దజన్లకొలది, వందలాది ఎకరాలు అవసరం లేదు. 3.4 ఎకరాలు మాత్రమే దానికి వదిలి మిగిలిన దేవుడి, సత్రం మాన్యాలు అన్నీ దళితులకు, మహిళలకు, భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి. భూస్వాములు, ధనికరైతుల నుండి వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఆదాయం పెంచుకోవాలనే దానితో ప్రభుత్వం - దేవాదాయశాఖ ఆ భూములకు వేలంపాటలు నిర్వహించరాదు. వేలంపాటలో దళితులు - పేదలు, భూస్వాములు, ధనికరైతులు, పెత్తందార్లతో పోటీ పడలేరు. వాటిని ప్రభుత్వమే నేరుగా భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి. శాశ్వతహక్కు కల్పించాలి. అందరివలెనే వాళ్ళ నుండి భూమిశిస్తు మాత్రం వసూలు చేయాలి. ఆదాయం పెంపుదల పిచ్చికంటే అన్నార్తుల ఆకలి తీర్చటం పాలకుల బాధ్యత, సహేతుకమని గుర్తించాలి. పేదలు సాగుచేసుకుంటున్న దేవుడి మాన్యాలపై పేదలకు హక్కు కల్పించాలి. సత్రం భూముల వినియోగాన్ని కూడా యిలాగే పరిశీలించి భూస్వాములు, ధనికరైతుల కబంధ హస్తాలనుండి విడిపించి పేదలకు పంపిణీచేయాలి. తూర్పుగోదావరి, గుంటూరు వంటి జిల్లాలో ఈ భూములు ఎక్కువగా వున్నాయి. పురోహిత కుటుంబాలు పేదరికంతో వుంటే యితరులకు పంపిణీ చేసిన విధంగానే వాళ్ళకూ పంపిణీ చేయాలి. మతసంస్థలకు, తిరుపతి, భద్రాచలం, శ్రీశైలం వంటి దేవాలయాలలో 'కళ్యాణం' పేరిట రాష్ట్రప్రభుత్వం ముత్యాల తలంబ్రాలు, పట్టు పీతాంబరాలు సమర్పించటం దుబారా చేయటం, దారుణమైన విషయం. వాటికి బదులు పేదల భూములు సాగుకు సౌకర్యాలు కల్పించటం అవసరం.

ఆదివాసీ, దళితుల భూమి రక్షణ :

పేదల భూముల రక్షణకోసమని చేసిన చట్టాలలో 1/70, అస్సైన్‌మెంట్ భూముల చట్టం ముఖ్యమైనవి. ఈ చట్టాలలో వున్న లొసుగుల కారణంగా చట్టాలున్నప్పటికీ ఆదివాసీల భూములు అన్యాక్రాంతమయ్యాయి. దళితులకు పంపిణీ చేసిన భూములు కూడా 50% చేజారి పోయాయి. వీటన్నింటిని నిర్దాక్షిణ్యంగా స్వాధీనం చేసుకుని లబ్దిదారులకు, అసలు యజమానులకు అప్పగించాలి లేదా భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి. భూమి రక్షణ కోసం చట్టాలు చేశామంటూనే అన్యాక్రాంతం చేసిన గిరిజనేతర భూస్వాములు, ధనికరైతులకు ప్రభుత్వం బూటకపు సెటిల్‌మెంట్ పట్టాలు యిచ్చారు. కొందరు అవినీతికర అధికారులు లంచాలకు ఆశపడి వున్నమేరకైనా చట్టాలను అమలు చేయటం లేదు. అతికొద్ది మంది అమలుకు పూనుకోబోతే వాళ్ళకు తక్షణ బదిలీలే గతి. తూర్పుగోదావరి జిల్లాలో రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్ వంటి ఐఎఎస్ ఆఫీసర్ల విషయంలో అదే జరిగింది. స్వాధీనం చేసుకొన్న భూములను లబ్దిదారులు లేదా భూమిలేని వారికి పంపిణీ చేయాలి తప్ప, భూ బ్యాంకులో వుంచి, ఆ తర్వాత ప్రజా ప్రయోజనాల పేరుతో కార్పొరేట్ సంస్థలకు అప్పగించరాదు.

అస్సైన్‌మెంట్ భూముల అమ్మకం నిషేధం - భూ రక్షణ నిధి :

ఈ చర్య అవసరమే. కాని దీన్ని నివారించేందుకు గ్రామస్థాయిలో పంచాయితీ స్థాయిలో స్వయం సహాయక గ్రూపులో భూరక్షణ నిధిని ఏర్పాటు చేయాలని, వాళ్ళు అవసరాలు తీర్చేందుకు వడ్డీలేని సులభ వాయిదాలపై దీని నుండి అప్పు యివ్వాలని ముసాయిదా చెబుతోంది. అయితే ఆ భూరక్షణ నిధికి నిధులు ఎవరు యిస్తారు? ఎవరు యివ్వాలనేది చెప్పలేదు. గ్రామాలపై, పంచాయితీపై వదిలేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. సాగుకోసం, అలాగే యితర అవసరాలకోసం భూమిని అమ్ముకునే పరిస్థితి ఏర్పడితే ప్రభుత్వమే ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలి. ఆ కుటుంబాలు నిలద్రొక్కుకునే వరకూ వడ్డీలేని, సబ్సిడీతో కూడిన రుణాలను ప్రభుత్వమే యివ్వాలి.

(మిగతా వచ్చే సంచికలో)



ఎం-ఎల్ కమిటీ నాయకులు కామ్రేడ్ కొల్లా వెంకయ్యకు విప్లవ జోహార్లు

కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు మరణించి సెప్టెంబరు 17 నాటికి 15 సంవత్స రాలు పూర్తి అయ్యింది. మరణించే నాటికి ఆయన వయస్సు 88 సంవత్సరాలు. ప్రజా ఉద్యమాలతో పెనవే సుకుపోయిన జీవితం ఆయ నది. 11వ ఏటనే జాతీయోద్యమంలో అడుగులు వేసిన తరువాత 60 సంవత్సరాల కమ్యూనిస్టు విప్లవోద్యమ ప్రస్థానం ఆయనది. అలజడి, ఆందోళనే ఊపిరిగా బ్రతికాడా కామ్రేడ్. తన తుది శ్వాస వరకు పీడిత, తాడిత ప్రజల కోసం ప్రజా ఉద్యమాల కోసం పోరాడారు. పార్లమెంటరీ పంధాను తిరస్కరించి దున్నేవాడికే భూమి కావాలని, సాయుధపోరాటమే మార్గమని నమ్మి చివరి వరకు విప్లవ రాజకీయాలవైపు నిలిచిన నిబద్ధత కల కమ్యూనిస్టు యోధుడాయన. విప్లవ కమ్యూనిస్టు నిర్మాతలలో ఆయన ఒకరు. జీవితానుభవం పీడిత ప్రజల కోసం పోరాడిన కామ్రేడ్ కొల్లా వెంకయ్యకు ప్రభుత్వం 7 సం॥లు జైలు జీవితం, 3 సం॥లు అజ్ఞాత జీవితం బహుమతిగా యిచ్చింది. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు, ఆటంకాలు, నిర్బంధాలు కల్పించినా, పీడిత ప్రజలు మాత్రం కామ్రేడ్ కొల్లా వెంకయ్యను "ఆంధ్ర భీష్ముడు"గా బిరుదు యిచ్చి తమ గుండెల్లో భద్రంగా దాచుకున్నారు. ఆయన రూపాన్ని వారి మనోఫలకాలపై ముద్రించుకున్నారు. ఆ తరం ఆదర్శ కమ్యూనిస్టుల నుండి నేటి తరం నేర్చుకోవలసినదీ, అనుకరించాల్సిందీ ఎంతో వుంది.

కామ్రేడ్ కొల్లా వెంకయ్య 1910లో గుంటూరు జిల్లా పెదనందిపాడులో రైతుకుటుంబంలో జన్మించారు. డిగ్రీ పూర్తి చేశారు. హిందీలో విశారద డిగ్రీ పట్టా గాంధీ చేతుల మీదుగా పొందారు. చదువుకునే రోజులలోనే ఉద్యమాల ప్రభావం ఆయనపై పడింది. జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. పన్నుల నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. జాతీయోద్యమ కాలంలో గాంధీ ప్రభావం ఆయనపై ఉంది. ఈ క్రమంలో 1934లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్‌కు ప్రతినిధిగా హాజరయ్యాడు. గుంటూరులో చదువుకునే రోజుల్లో విద్యార్ధులతో, ఉపాధ్యాయులతో నిరంతరం చర్చలు జరిపేవాడు. అంతిమంగా గాంధీ సిద్ధాంత ప్రభావం నుండి బయటపడి కమ్యూనిస్టు ప్రభావం వైపు వచ్చి 1936లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ఆనాటి నుండి రైతులూ, కూలీల సమస్యలపై నిరంతరంగా పోరాడారు. రైతాంగ సమస్యలపై ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు జరిగిన రైతు యాత్రలో పాల్గొని తన వంతుగా గ్రామాల్లో తిరిగి ప్రచారం చేశాడు. అనేక గ్రామాల్లో తిరిగి పార్టీ కమిటీలను రైతు సంఘాలను, వ్యవసాయ కూలీ సంఘాలను నిర్మాణం చేశాడు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా 1946లో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా పనిచేశాడు. కమ్యూనిస్టుపార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ మధురై పార్టీ మహాసభలో కేంద్రకంట్రోల్ కమీషన్ సభ్యునిగా ఎన్నికైనాడు. రైతు సంఘం నాయకుడిగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. రొంపేరు ముంపువల్ల రైతుల పంటలు నష్టపోవడమే కాక, పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రైతు యాత్రలు నిర్వహించి ప్రజలను పెద్ద ఎత్తున కదిలించాడు. ముంపు నివారణకు ప్రభుత్వం నుండి నిధులు రాబట్టడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. సముద్రతీర ప్రాంత రైతులకు అధికోత్పత్తి కోసం రసాయనిక ఎరువులు అవసరమని ఆందోళన నిర్వహించి విజయం సాధించాడు. పొగాకు పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని రైతు సంఘం నాయకత్వంలో చేసిన ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించడానికి అంగీకరించి అమలులోకి తెచ్చింది. పొగాకు మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికై 1944 నుండి 1947 వరకు కొనసాగాడు. పొగాకు తూకాల్లో మోసం జరుగకుండా వ్యాపారుల దోపిడీ నుండి రైతాంగానికి రక్షణగా నిలబడ్డాడు.

రైతాంగ సమస్యలతోపాటు, రైతు కూలీల సమస్యలపై పోరాటాలు నిర్వహించాడు. పాలేర్ల సమ్మెకు నాయకత్వం వహించాడు. బ్యారన్ కూలీల రేట్ల కోసం ప్రజలను సంఘటిత పర్చి ఉద్యమాలు నిర్వహించాడు. దీనికోసం వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మాణం చేసి జిల్లా వ్యాపిత ఉద్యమంగా మార్చాడు. బాపట్ల తాలూకాలో జులై, ఆగష్టు నెలలో జరిగిన పాలేర్ల యాత్రపై పోలీసులు కాల్పులు జరిపి జట్టి సుబ్బారావు మరణానికి కారకులయ్యారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ఉద్యమం పెల్లుబికింది. దీనిలో కామ్రేడ్ కొల్లా వెంకయ్య ముందు పీరిన ఉన్నాడు.

1946-51 నాటి తెలంగాణా సాయుధ పోరాటం జరుగుతున్న రోజుల్లో తెలంగాణా ఉద్యమాలను మైదాన ప్రాంతాలకు విస్తరించాలని ఆనాటి కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా కామ్రేడ్ కొల్లా వెంకయ్య కార్యదర్శిగా, కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి, కామ్రేడ్ పెదవల్లి శ్రీరాములుతో కలిపి రీజనల్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ పిలుపు మైదాన ప్రాంత జిల్లాలలో అమలు సాధ్యాసాధ్యాలపై తనకు భిన్నాభిప్రాయాలున్నా ప్రజల్ని చైతన్య పర్చడంలో తన వంతు కృషి చేశాడు. 200 మందితో దళాలను ఏర్పాటు చేశారు. ఈ సమాచారం ముందుగా తెలుసుకున్న పోలీసులు వారిపై దాడి చేశారు. ఈ దాడిలో కామ్రేడ్ దండా నారాయణ స్వామి అమరులయ్యారు. ఈ సందర్భంగా అనేక మంది రహస్యజీవితంలోకి వెళ్లారు. కామ్రేడ్ కొల్లా వెంకయ్య రహస్యజీవితంలో అనేక కష్టాలు అనుభవించినా ప్రజల్లో మమేకం కావడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈ సందర్భంలో ఆయనకు అనేక దళిత వాడలు ఆశ్రయం యిచ్చాయి. భూస్వాములు, పెత్తందార్లు మాత్రం పోలీసులకు అండగా నిలిచారు.

తెలంగాణా పోరాటం తర్వాత ముందుకు వచ్చిన నక్సల్బరీ పోరాటం భూమి సమస్యను, వ్యవసాయక విప్లవ పంధాను మరో సారి అజెండా మీదకు తెచ్చింది. పార్లమెంటరీ పంధాను తిరస్కరించి ఆంధ్రలోని మెజారిటీ శ్రేణులు విప్లవ పంధా వైపు మొగ్గారు. నయా రివిజనిజం నుండి తెగదెంపులు చేసుకుంటూ కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, కామ్రేడ్ కొల్లా వెంకయ్య గార్లు బహిరంగంగా పిలుపునిచ్చారు. మార్క్సిస్టు పార్టీ నుండి తెగతెంపులు చేసుకున్నారు. ఆంధ్రలోని విప్లవ కమ్యూనిస్టులు తమ రాజకీయ భిన్నాభిప్రాయాలను రిజర్వులో ఉంచుకొని అఖిల భారత విప్లవకారుల సమన్వయ కమిటీలో విలీనమయ్యారు. చారుమజుందార్ తన అతివాద ధోరణులతో ఎటువంటి చర్చలు లేకుండానే మరసటి సమావేశానికి అఖిల భారత విప్లవకారుల సమన్వయ కమిటీ నుండి ఆంధ్ర కమిటీని బహిష్కరించారు. చారు అతివాదానికి ప్రత్యామ్నాయంగా ప్రజాపంథాలో వ్యవసాయక విప్లవాన్ని నిర్మించాలని భావించిన కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ చంద్ర పుల్లా రెడ్డి నాయకత్వంలోని పార్టీలు కూడా ఆచరణలో అనేక చీలికలకు గురైనాయి. ఆ తరువాత వేరు వేరు పార్టీలుగా ఏర్పడి వివిధ ప్రాంతాలలో తమ శక్తి కొలది ఉద్యమాలు నిర్మిస్తున్నారు. కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు మరికొంత మంది కామ్రేడ్స్ కలిసి మార్క్సిస్టు-లెనినిస్టు కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామీణ పేదల సంఘాన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీల సమస్యల, భూమి సమస్యలపై అనేక కార్యక్రమాలు చేపట్టారు.

తెలంగాణా పోరాట విరమణ తరువాత జరిగిన ఎన్నికల్లో పోటీ చేయాలని ఆనాటి కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. 1952లో పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు శాసన సభ్యులుగా ఎన్నికైనారు. 1957లో రాష్ట్ర శాసన మండలికి ఎన్నికైనారు. అలాగే 1962లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెనాలి పార్లమెంటు నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. విశాఖ ఉక్కు ఉద్యమం సందర్భంగా తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కమ్యూనిస్టు పార్టీ బూర్జువా, భూస్వామ్య పార్టీలతో ఎన్నికల పొత్తులకు దిగడం నష్టకరమని భావించాడు. కమ్యూనిస్టు పార్టీ భూస్వాముల పార్టీలతో పొత్తులకు దిగిన తరువాతనే దళితులూ, బలహీన వర్గాల ప్రజలు క్రమంగా పార్టీకి దూరమయ్యారని ఆయన భావించాడు. విప్లవ ప్రత్యామ్నాయం చూపించగల స్థితిలో లేనందున పీడిత ప్రజలు క్రమంగా పాలక పార్టీలవైపు అంబేద్కర్ వాదనలను బలపరిచే దళిత నాయకులవైపు మొగ్గారని ఆయన బలమైన నమ్మకం. కుల వ్యవస్థ యొక్క దుష్పలితాల గురించి కమ్యూనిస్టులం సమగ్ర అవగాహన కలిగి వున్నామని అనుకోవడం అతిశయోక్తి అవుతుందని కులం సమస్యను యింకా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని భావించాడు. ఆయన నాయకుడిగానే కాకుండా ప్రజల్లో ఒక కార్యకర్తగా కూడా పనిచేశాడు. కారంచేడు భూస్వాములకు వ్యతిరేకంగా పార్టీ తరుపున పేదలకు భూమి పంపిణీ చేయాలనే సమస్యపై పెద్ద పోరాటం జరిగింది. ఈ సందర్భంలో భూస్వాములు నాలుగు వందల మందిని సమీకరించి గొడ్డళ్ళు, కర్రలతో వివాదస్పద భూమి వద్దకు రాగా పార్టీ కార్యకర్తలు, పేదలు వారిపై ప్రతిదాడికి పూనుకోగా భూస్వాములు, వారి తొత్తులు పలాయనం చిత్తగించారు. ఈ విజయం ప్రజల సమైఖ్యతకూ, ఉద్యమ నిర్మాణానికి దోహదపడిందని ఆయన పదే పదే చెప్పేవాడు.

ఒక వైపు తెలంగాణా పోరాటాన్ని నెత్తురుటేరుల్లో ముంచి మరోవైపు నెహ్రూ ప్రభుత్వం ప్రజలను వంచించడానికి అనేక సంస్కరణలను ముందుకు తెచ్చింది. ఆచరణకు నోచుకోని చట్టాలను చేసింది. దానిలో భాగంగా 1956 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కౌలుదారీ చట్టాన్ని చేసింది. భూస్వాముల చేతిలో ఉన్న దేవాదాయ, ధర్మాదాయ భూములను తప్ప రాష్ట్రంలో మిగతా కౌలుదార్లు అందరూ మూజువాణి కౌలుదార్లు, ఈ కౌలుదార్లు పేర్లు నమోదు చేయడంగానీ దాని కోసం యంత్రాంగాన్ని రూపొందించడంగాని లేకుండా ఈ చట్టాన్ని చేసింది. దీనిపై కామ్రేడ్ కొల్లా వెంకయ్యగారు కౌలుదార్లను భూములపై నిలబెట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం కౌలుదార్లను అరెస్టుచేసి భూస్వాముల పక్షాన్నే నిలబడింది. చట్టాల యొక్క డొల్ల తనాన్ని కామ్రేడ్ కొల్లా వెంకయ్యగారు ఈ సందర్భంగా బహిరంగ పర్చారు.

నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవోద్యమాలు వెల్లువెత్తినపుడు ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని ప్రయోగించింది. అనేక మంది విప్లవకారులను కాల్చి చంపింది. మరోవైపు ఉద్యమాలను నీరుగార్చడానికి ప్రజలను ప్రక్కదోవ పట్టించడానికి భూసంస్కరణల చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఆచరణలో భూసంస్కరణల చట్టాన్ని ఒక ప్రహసనంగా మార్చింది. భూసంస్కరణల చట్టం అమలులోకి వస్తే రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులుభూమి తేలుతుందని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని 16.63 లక్షల ఎకరాలకు తగ్గించింది. పంచపాండవులు, మంచం కోళ్ళు సామెతగా చివరికి 8 లక్షల ఎకరాలకు పరిమితం చేసి 5 లక్షల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మిగులు భూములు అంచనా తగ్గడానికి చట్టంలో అనేక మినహాయింపులు, లొసుగులు ఉన్నాయి. తోటలు, సహకార సంఘాల భూములు, దేవాదాయ భూములు ఈ చట్టం నుండి మినహాయించారు. భూసంస్కరణల చట్టం 1973 జనవరిలో జరిగిన అసెంబ్లీలో ఆమోదం పొందింది. రాష్ట్రపతి సంతకం 1975 జనవరి 1న చేశారు. భూసంస్కరణల చట్టం 1973 నుండి కాకుండా 1975 నుండి అమలు లోకి వస్తుందని కొంతమంది వాదించారు. భూస్వాములు తమ భూములను కాపాడుకోవడానికి బినామీ పేర్లతో తెల్ల కాగితాలపై క్రయ విక్రయాలకు పూనుకున్నారు. ఈ క్రయ విక్రయాలు చెల్లుతాయని 1979లో రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. 1973 తర్వాత పేదలకు పంచిన భూములను సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూస్వాములకు పంపిణీ చేసింది. దీనిని సవాలు చేస్తూ కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. 1979లో హైకోర్టు యిచ్చిన తీర్పు చెల్లదని 1982లో సుప్రీంకోర్టు హైకోర్టుతీర్పును కొట్టి వేసింది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఈనాటికి అధికారంలోకి వచ్చిన ఏ పార్టీకూడా అవసరమైన చర్యలు తీసుకోలేదు. భూస్వాములకు అనుకూలంగా తీర్పుల వచ్చినపుడు హడావిడిగా అమలు చేసిన ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా తీర్పు వచ్చినపుడు అమలు చేయక పోవడంలో అధికారంలో ఉన్న పార్టీల వర్గ స్వభావాన్ని తెలియజేస్తుంది.

(మిగతా 7వ పేజీలో...)

ఒకరి నుండి మరొకరు నేర్చుకోవాలి

ఆత్మతృప్తితో పెరిగే అలక్ష్యాన్ని అహంభావాన్ని అధిగమించాలి

డిసెంబర్ 13, 1963

మావో సె టుంగ్

ఆత్మ సంతృప్తి, అహంభావానికి లోనవడమూ, మార్క్సిస్టు గతితార్కిక విశ్లేషణా పద్ధతిని, అంటే, ఒకటిన రెండుగా (విజయాలు, లోపాలుగా) విభజించి చూసే పద్ధతిని ఉపయోగించడానికి నిరాకరించడమూ, కేవలం తన రంగానికి మాత్రమే పరిమితమైపోయి పనిచేయడమూ, విజయాలను మాత్రమే అధ్యయనం చేస్తూ, లోటుపాట్లను కానీ తప్పుల్నిగానీ అధ్యయనం చేయకపోవడమూ, పొగడ్తలను కోరుకోవడం, విమర్శలను సహించలేకపోవడమూ, ఇతర రాష్ట్రాలు, నగరాలే, ప్రాంతాల లేదా విభాగాల పనిని పరిశోధించి, దాని నుండి నేర్చుకుని, ఆ ఫలితాలను, తమ పరిస్థితులను మెరుగు పర్చుకునేందుకు, తమ రాష్ట్రం, ప్రాంతం, నగర లేదా విభాగపు పనిని మెరుగుపర్చుకునేందుకు వినియోగ పెట్టుకోవడంలో, సమర్థులైన పైస్థాయి మధ్యస్థ స్థాయిల కేడర్లను సంఘటితపర్చడం పట్ల ఏ మాత్రం శ్రద్ధ కనబర్చకపోవడమూ, గుడ్డి అహంభావంతో మెసలడం, అంటే తన సొంత జిల్లా లేదా సొంత డిపార్టుమెంటు అనే చిరు ప్రపంచానికి పరిమితమైపోవడమూ, తన పరిధిని విస్తృతపర్చుకునే సామర్థ్యం లోపించడమూ, ఇతర కార్య రంగాల గురించి అజ్ఞానంతో ఉండడమూ, విదేశీయులకూ, ఇతర తావుల నుండి వచ్చిన సందర్శకులకూ, కేంద్రం పంపేవారికి, తన కార్యరంగంలోని విజయాలను గురించి మాత్రమే తెలియజెప్పి, వాటి గురించే మాట్లాడి, బలహీనతల విషయంలో మౌనం వహించడమూ, సారంలేని సొల్లు కబుర్లు చెప్పడం, మొక్కుబడిగా (పెర్ఫంక్టోర్లి) మాట్లాడడం (మన కామ్రేడ్స్ అందరిలోనూ ఈ లోపాలు వున్నాయి). కేంద్ర కమిటీ ఈ సమస్యను మన కామ్రేడ్స్ దృష్టికి పలుమార్లు తెచ్చింది. ప్రతి కమ్యూనిస్టూ, 'ఒకటిని రెండుగా', విజయాలు, లోపాలు: నిజాలు, తప్పులుగా విభజించి చూసే మార్క్సిస్టు గతితార్కిక పద్ధతికి సదా అంటిపెట్టుకుని ఉండాలి. అన్ని విషయాలూ (ఆర్థిక, రాజకీయ, సిద్ధాంత, సాంస్కృతిక, సైనిక, పార్టీ వగైరా) నిరంతరమూ ఒక అభివృద్ధి క్రమంలోనే వుంటాయి. ఇది మార్క్సిస్టులకుండే సాధారణ అవగాహన. అయితే కేంద్రంలోని, ప్రాంతంలోని అనేక మంది కామ్రేడ్స్ ఈ ఆలోచనా పద్ధతిని, ఈ పని పద్ధతిని వాడరు. వారి బుర్రల్లో లాంఛనతర్క (ఫార్మల్ లాజిక్) బలంగా నాటుకుని వుంది. వారు దాన్ని వొదిలించుకోలేక పోతున్నారు. లాంఛనతర్కం, విషయంలోని విరుద్ధాంశాల ఐక్యతనూ, విరుద్ధాంశాల జత, మరో దానిగా రూపాంతరం చెందుతుంది అనేదాన్ని నిరాకరిస్తుంది. అందుచేతనే ఈ కామ్రేడ్స్ ఆత్మ సంతృప్తిపరులూ, అహంభావులూ అవుతారు. విజయాలను మాత్రమే చూస్తూ, బలహీనతల పట్ల అంధులవుతారు. తమకు వినసొంపుగా వుండే విషయాలను మాత్రమే వినగలుగుతారు. విమర్శలను భరించలేరు. తమల్ని తాము విమర్శించుకోవడానికి (అంటే ఒకటిని రెండుగా విభజించి చూడడానికి) ఇష్టపడరు. ఇతరుల విమర్శలకూ భయపడతారు. 'అహంకారం ప్రమాదకారి, వినయం ప్రయోజనకారి' అనే పాత నానుండి (శ్రామిక వర్గ ప్రయోజనాల దృష్ట్యానూ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యానూ కూడా) ఇప్పటికీ వర్తించే నానుడే.

1) అహంభావం అనేది, అన్ని పరిస్థితులలోనూ, అన్ని రూపాలలోనూ పెరుగుతుంది. సాధారణంగా అది, విజయంతోనూ, గెలుపుతూనూ పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏమంటే, ప్రతికూల పరిస్థితులలో తన బలహీనతలను ఎవరైనా తేలిగ్గనే గమనించగలరు. అందువల్ల సాపేక్షికంగా కొంత జాగ్రత్తగా మెసులుకుంటారు. ఇబ్బందులు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పుడు విషయం, ఆచితూచి అడుగు వేయడం అనేవే అవలంభించాల్సిన వైఖరులు. అయితే విజయంతోపాటు ఇతరుల కృతజ్ఞతలు కూడా వస్తాయి. ఒకప్పటి శత్రువు కూడా మనసు మార్చుకుని ఒక వ్యక్తిని (అతని శక్తి సామర్థ్యాలను) కీర్తించవచ్చు. అందుచేత విజయం తర్వాత అనుకూల పరిస్థిఉలలో ఎవరికైనా సులువుగానే బుర్రకు కిర్రెక్కవచ్చు. అతడు గాలిలో స్వారీ చేయవచ్చు. 'ఇక నుంచిరాజ్యం అంతా ప్రశాంతంగా ఉంటుంది' అని విశ్వసించవచ్చు. విజయం, సఫలత లభించిన సందర్భాలలో పార్టీ, అహంకారమనే విషక్రిమి వాతానికి గురయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయన్న విషయం మనందరికి బాగానే తెలుసు.

2) అహంకారం విజయం సిద్ధించిన పరిస్థితులలో పెరుగుతుంది - అంటే, బుర్రకు కిర్రెక్కడం, అహంకారంతో ఉబ్బితబ్బిబ్బు అవడం అనేవి అహంభావ లక్షణాలు. ఇది ఒక రకం అహంఅవం. సాధారణ పరిస్థితులలో పెరిగే మరో రకం అహంభావం వుంది. ఎటువంటి బ్రహ్మాండమైన విజయంగానీ, లేదా తలవొంపులుతెచ్చే ఘోర ఓటమి కానీ లేనప్పుడు 'అంత శ్రేష్టుడిని ఏమి కాకపోయినప్పటికీ, దద్దమ్మకంటే నేను నయమే కదా', 'ఇరవై యేళ్ళ కోడరికం, ఆ కోడల్ని సహజసిద్ధంగా అత్తను చేస్తుంది' వంటి ఆలోచనలతో మెదడుకు మత్తెక్కినపుడు ఇది పెరుగుతుంది.

వెనుకబడిన పరిస్థితుల్లో వికసించే మూడవ రకం అహంభావం వుంది. 'మా పని అంతబాగా ఏమీ లేనప్పటికీ గతంలో కంటే మెరుగ్గానే వుంది కదా' అనిగానీ 'ఫలానా, ఫలానా వాడు మనకంటే మరీ అధ్వాన్నం కదా' అనిగానీ కొందరు ఆలోచిస్తూ, అందు మూలంగా తమ వెనుకబాటుతనాన్ని గురించి గర్వపడుతుంటారు. ఇకవారు తమ విషయాలనన్నింటినీ వెంటనే పక్కకు పెట్టేస్తారు. వారి మొఖాలు వెలిగిపోతాయి. ఇక వారు 'ఒకప్పుడేం జరిగిందంటే' అని మొదలెడతారు.

3) మనం ఎప్పుడైతే ప్రజారాశుల బలాన్ని చిన్నచూపు చూస్తామో, ఎప్పుడైతే మన స్వీయమానసిక అవగాహన భౌతిక వాస్తవికతాభివృద్ధికంటే వెనుకబడుతుందో, మన స్వీయ సాఫల్యతల గురించి ఎప్పుడైతే మనం అతిగా అంచనా వేసుకుంటామో, అప్పటి నుంచే మనం అహంభావులమవుతాము.

4) అహంభావం, ప్రధానంగా వ్యక్తిత్వం (ఇండివిద్యువలిజం) నుండి పుట్టుకొస్తుంది, వ్యక్తిత్వాన్ని పెంచి పోషిస్తుంది.

5) వర్గ విశ్లేషణా దృష్టి నుండి చెప్పాలంటే, అది మొదటగా దోపిడీ వర్గ భావజాలం నుండి, అటుపిమ్మట చిన్నపాటి ఉత్పత్తిదారుల భావజాలం నుండి ఉత్పన్నమవుతుంది.

6) చిన్నపాటి ఉత్పత్తిదారులకు శ్రామికులుగా అనేక సద్గుణాలు ఉన్నాయి. వారు కష్టించి పనిచేస్తారు. పొదుపుగా వుంటారు. కష్టాలు కడగండ్లకు భయపడరు. వాస్తవాత్మకంగా వుంటారు. ఆచితూచి అడుగువేస్తారు. అయతే, చిన్నపాటి యజమానులుగా వారు, వ్యక్తిత్వ పోకడలతో వుంటారు. అంతకంటే ముఖ్యంగా, వారి పని పరిస్థితులూ పద్ధతులూ వారు వాడే కాలంచెల్లిన ఉత్పత్తి సాధనాల మూలంగా పరిమితికి లోనై వారు చెల్లాచెదురుగా విస్తరించి వుండి సంకుచిత మనస్తత్వంతో వుంటారు. విషయ పరిజ్ఞానం కొరవడి వుంటారు. వారు తరచుగా సమిష్టికి వుండే బలాన్ని చూడలేరు. ఒక చిన్న సాఫల్యత వారిలో 'ఇది ఫరవాలేదే', 'ఇది బ్రహ్మాండంగా వుందే', 'కొంచెం మజా చేద్దాం', 'అంత శ్రేష్టుడినేమీ కాకపోయినప్పటికీ దద్దమ్మకంటే నయమే కదా' వంటి ఆలోచనల్ని రేకెత్తిస్తుంది.

7) అహంభావానికి బూర్జువా, భావవాద ప్రాపంచిక దృక్పధమే పునాది. అది మనల్ని వాస్తవాభివృద్ధి నియమాలకు వ్యతిరేకంగా వాస్తవంతో వ్యవహరించేటట్లు చేయగలరు. అంతిమంగా వైఫల్యానికి దారితీసేటట్టు చేయగలదు. సామాజికాభివృద్ధి చరిత్ర బడానాయకుల చరిత్ర కాదనీ, శ్రమజీవి ప్రజానీకపు చరిత్రేననీ, భౌతికవాద చారిత్రక దృక్పధం తెలియ చెబుతోంది. అయినాగానీ, అహంభావులు వ్యక్తుల పాత్రను గోరంతల్ని కొండంతలు చేస్తారు. అవసరమైన గొప్పల్ని ఆపాదించుకుంటారు, తమన్ని చూసి తామే ఉబ్బి పోతుంటారు. వారు ప్రజల బలాన్ని తక్కువగా అంచనా వేస్తారు, లేదా అసలు దాన్ని గమనించనే గమనించరు.

8) అందుచేత అహంభావం మార్క్సిజం - లెనినిజానికి వ్యతిరేకమైంది. మన పార్టీ తాలూకు గతితార్కిక, చారిత్రక, భౌతికవాద ప్రాపంచిక దృక్పధానికి విరుద్ధమైనది.

9) అహంకారులు తమ గొప్పల్ని మరువలేరు. తమ లోపాల్ని కప్పిపుచ్చుతారు. ఇతరులలోని మంచి లక్షణాలను అసలు లెక్కలోకే తీసుకోరు. వారు తరచుగా తమ గొప్పల్ని ఇతరుల లోపాలతో పోల్చి చూసుకుంటూ ఆ విధంగా సంతృప్తి పడుతుంటారు. ఇతరులలోని మంచి లక్షణాలు వారి దృష్టికి వచ్చినప్పుడు వారు 'ఆ! పెద్దగా ఏం వున్నాయట' అనీ, 'అంత సంబరపడాల్సిందేమీ లేదు' అనీ అంటుంటారు.

10) వాస్తవానికి, ఎవరైనా తన గురించి ఎంత ఎక్కువగా అంచనా వేసుకుంటే, ఫలితం అంతకంత ఘోరంగా వుంటుంది. రష్యా మహా రచయిత టాల్‌స్టాయ్ ఈ విషయాన్ని గురించి చమత్కార పూర్వకంగా ఇలా వ్రాశారు. మనిషిని గణితశాస్త్రంలోని భిన్నం (ఫ్రాక్షన్)తో పోల్చవచ్చు. అతడి నిజ ప్రతిభను ఆ భిన్నం తాలూకు లవంతోనూ, దాన్ని గురించిన అతడి స్వీయ అంచనాను హారంతోనూ పోల్చవచ్చు. హారం ఎంత పెద్దదైతే భిన్నం అంత చిన్నదవుతుంది.

11) వినయం అనేది ప్రతి విప్లవకారుడికి తప్పనిసరిగా వుండాల్సిన ఒక మంచి లక్షణం. అది ప్రజల ఆశయానికి మేలు చేస్తుంది. కాగా, అహంభావం ప్రజల ఆశయపు ఓటమికి బాట వేస్తుంది. అందుచేత వినయం అనేది ప్రజల ఆశయం పట్ల ఒక వ్యక్తి తాలూకు బాధ్యతను సూచించే ఒక వ్యక్తీకరణ.

12) మనసా వాచా విప్లవకారుడైనవాడు ఈ క్రిందివాటిని తప్పనిసరిగా నిర్వర్తించగలిగి వుండాలి.

మొదటిది : ప్రజల సృజనాత్మకశక్తి పట్ల గౌరవం చూపాలి. వారి అభిప్రాయాలను జాగ్రత్తగా వినాలి. వారిలో ఒకడిగా మసలుకోవాలి. అతడికి ఆవగింజంత స్వార్థం కూడా వుండకూడదు. తన పాత్రను ఎక్కువచేసి చూడకూడదు. ప్రజల కోసం నిజాయితీగా పనిచేయాలి. లూషన్ ఈ చైతన్యాన్ని గురించి ఇలా వివరించారు. 'నేను ప్రజల కోసం తలవొంచి ఒక ఎద్దులా సేవ చేస్తాను'. విషయం అంటే అదే.

రెండవది : అతడికి అలసటే తెలియని పురోగమితత్వం తప్పనిసరిగా వుండాలి. అతడు నిరంతరం జాగరూకంగానూ స్పష్టమనస్కంగానూ వుండాలి. అతడు తప్పనిసరిగా కొత్త విషయాలను బాగా గమనింఅచలి, వాటిని పరిశీలించాలి. అందుచేత అతడు అనావశ్యకమైన దుర్లక్షణాలను పోగుచేసుకోకుండా వుంటూ, తన విజయాలతోనే సంతృప్తి పడిపోయేటట్టుగాక వినయంగా వుండాలి. ఇది వాస్తవ వైఖరి, ఇది వినయం అనే మహత్తర గుణం.

13) ఒక మనిషి, పని నుండీ, జీవితం నుండీ, వాస్తవ పోరాటాల నుండీ శ్రద్ధగా నేర్చుకోగలిగితే, తన లోటుపాట్లను లొసుగుల్ని పొరపాట్లను కనుగొనే దృష్టిలో భాగంగానే తన ఆలోచనలనూ కార్యాచరణనూ నిరంతరం మదింపు వేసుకోగలిగితే, అతడు తన అహంకార ఆత్మసంతృప్తి వైఖరులకు వ్యతిరేకంగా నిర్దాక్షిణ్యంగా నిశ్చయాత్మకంగా పోరాడి, ఎటువంటి తటపటాయింపులకూ లోనుకాకుండా వాటిని అధిగమించగలిగితే, ఒక వినమ్ర మానవుడిగా తనని తాను తీర్చిదిద్దుకోవడం అతడికి ఖచ్చితంగా అతి సుసాధ్యమవుతుంది.

14) నిజంగానే వినయంగల మనిషి పార్టీకోసం, ప్రజల కోసం, సమిష్టి ఆశయం కోసం సమధికోత్సాహంతోనూ ఎటువంటి తటపటాయింపులూ లేకుండానూ అంకిత భావంతోనూ క్రియాశీలిగానూ పనిచేసే మనిషి అవుతాడు. అతడు తన గొప్పను ప్రదర్శించుకోవడం కోసమో లేదా పేరు ప్రఖ్యాతులు బహుమతుల సముపార్జన కోసం వారి ప్రయోజనాల కోసం హృదయ పూర్వకంగా కృషి చేస్తాడు. అందుచేతనే అతడు తన ప్రతిభకు గుర్తింపు, తన హోదా, పేరు ప్రఖ్యాతుల సముపార్జన లేదా జీతభత్యాల వంటి విషయాలకు తన బుర్రలో అసలు తావే ఇవ్వకుండా, పార్టీకీ ప్రజలకూ ప్రయోజనకారి అయిన కృషిలో క్షణం తీరిక లేకుండా సదా నిమగ్నుడై వుంటాడు. తన విజయాల గురించి ఇతరులతో ఏకరువు పెట్టడు. అసలు అటువంటి ఆలోచనే బుర్రలోకి రానివ్వడు. ప్రజలకు ఇంతకంటే మిన్నగా ఎలా సేవ చేయాలి అనే విషయం గురించి తప్ప మరో విషయాన్ని గురించి లోచించడు.

15) ఇక సిసలైన సమిష్టితత్వవాది, తను వినయంగా వుండాలని ఎందుకు కోరుకోవాలి? ఎందుచేతనంటే :

మొదటిది, విజ్ఞానాన్నిగానీ, ఇతర ఫలితాలనుగానీ సాధించడంలో తాను ఒక పాత్రను నిర్వహించినప్పటికీ అందులో ప్రజల పాత్ర మరింత పెద్దదని అతడు అవగతం చేసుకుంటాడు.

ప్రజల అండదండలు లేనపుడు అతడికి విజ్ఞానమూ దక్కదు, అతడి పని సఫలమూ కాదు. సమిష్టితత్వవాదిగా అతడు ప్రజల గొప్పతనాల్ని తోసిరాజనకూడదు. లేదా 'ప్రజల విజయాలను వారి నుంచి దొంగిలించకూడదు'. అహంభావంతో వుండడం సిగ్గుచేటైన విషయమని అతడికి తెలుసు.

రెండవది, తాను నేర్చుకున్నదిగానీ తన స్వీయకృషిగానీ విప్లవ విజ్ఞానం, కృషి అనే మహాసముద్రంలో ఒక చిన్న నీటి చుక్కేననీ అణుప్రమాణమైనదనీ అతడికి తెలుసు. అంతేకాదు విప్లవ విజ్ఞానం, కృషి నిరంతరాయంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఒక సమిష్టి తత్వవాదిగా అతడు ప్రజలకు ఉపయోగకరంగా వుండే విజ్ఞానాన్ని సంతరించుకోవడానికీ, తన యావత్ సామర్థ్యాన్ని విప్లవానికి అంకితం చేయడానికీ శాయశక్తులా పాటుపడాలి. అందుచేత, ఆత్మ సంతృప్తితో వుండడానికిగానీ, ఎదుగూ బొదుగూ లేకుండా గిడసబారిపోవడానికిగానీ ఏ మాత్రం సందులేదని అతడు భావించాలి.

మూడవది, పని అనేది చక్రాలు, సీలలు, ఉక్కు చట్రాలు, రకరకాల సైజుల్లోని ఇతర భాగాలతో కూడుకుని వుండే ఒక భారీ యంత్రంలాంటిదనీ, అందులోని ఏ ఒక్క భాగాన్ని వేరు చేసి పక్కన పడేయలేమనీ అతడికి తెలుసు. ఒక సమిష్టి తత్వవాదిగా అతడు ప్రతి వొక్కరి పనినీ ప్రతివొక్కరి సాఫల్యాలనూ గౌరవించాలి. విప్లవ కృషిని సర్వాంగ పరిపుష్టంగా చేయడానికి అతడు తన పనిని ఇతరుల పనితో సమన్వయించుకోవాలి. సమిష్టి నుండి వేరుపడి విడిగా మనజాలనని అతడు భావించాలి. తన సహచరులను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించాలి. ఇందువల్ల అతడు ఇతరులపట్ల వినయంగా ప్రవర్తించాలి. గర్వంతోగానీ అహంభావంతోగానీ ప్రవర్తించరాదు.

నాలుగవది, వ్యక్తి దృక్పధం సంకుచితమైనదీ పరిమితమైనదీ కాగా, విప్లవ కృషి విజ్ఞానాల పరిధి చాలా సువిశాలమనీ వాటి సారం సుసంపన్నమూ సంక్లిష్టమూ అనీ అతడు అవగతం చేసుకున్నాడు. ఆ విధంగా వ్యక్తికి లొసుగులు అనివార్యమనీ తప్పులు చేసే అవకాశం బాగా వుంటుందనీ అతడికి అర్ధమవుతుంది. ఈ లొసుగులు, తప్పులు తరచుగా అతడి దృష్టిలోకి రావు. అయితే, అతడో సమిష్టి తత్వవాది కనుక విప్లవ కృషిని సమర్ధవంతంగా నిర్వహించి ప్రజల పట్ల బాధ్యతతో మెలగడానికిగానూ, తన లోపాలూ తప్పులనూ సకాలంలో కనుగొని వాటిని త్వరితంగా సరిదిద్దుకోవడానికై మరింత లోతైన అవగాహనను పెంపొందించుకోవడానికి కృషి చేస్తాడు. ఇందుమూలంగా అతడు వినయంగా వుంటాడు. నమ్రతతో ఇతరుల నుండి నేర్చుకుంటూ ఇతరుల విమర్శలను నిజాయితీగా ఆహ్వానిస్తాడు.

ఒక నిజమైన సమిష్టి తత్వవాదికి వినయం వుంటుందని పై అంశాల నుండి మనం గ్రహించవచ్చు. ఇది అతడి పురోగామి చైతన్యానికీ వాస్తవాత్మక వైఖరికీ అద్దంపట్టే ఒక వాస్తవం.

16) అహంకారాన్ని అధిగమించి వినయాన్ని పెంపు చేసుకోవడానికి మరో పద్ధతి ఏమిటంటే, తన కమ్యూనిస్టు చైతన్యాన్ని పెంపొందించుకోవడం. దీనికి మార్క్సిజం - లెనినిజాన్ని మరింత ముమ్మరంగా అధ్యయనం చేయాల్సి వుంటుంది.

17) ఏమంటే ప్రపంచాన్ని గురించి, వ్యక్తులకూ ప్రజలకూ మధ్యా, వ్యక్తికి సమిష్టికీ మధ్యా, వ్యక్తులకూ సంస్థకూ మధ్యా, వ్యక్తులకూ పార్టీకీ మధ్యా సంబంధాల గురించి శాస్త్రీయంగా అవగాహన చేసుకోవడానికి మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలు మనకు ఉపయోగపడతాయి.

విప్లవ పోరాటంలో ప్రజల, వ్యక్తుల పాత్రల గురించి సరిగ్గా అర్ధం చేసుకోవడానికి కూడా అవి మనకు ఉపకరిస్తాయి. సామాజిక సంపదకు శ్రమజీవులే సృష్టికర్తలనీ, విప్లవ పోరాటానికి వారే మూల స్తంభాలనీ మార్క్సిజం-లెనినిజం మనకు చెబుతోంది. చైనాలో సోషలిజం కమ్యూనిజంలను నిర్మించడానికి తమ అగ్రగామిదళ నాయకత్వం కిద నడుస్తున్న కార్మికవర్గపూ, కోట్లాది శ్రమజీవులా సృజనాత్మకశక్తి మీద మనం తప్పనిసరిగా ఆధారపడాలి. ఇక వ్యక్తి విషయానికి వస్తే, అతడు ఒక విప్లవ యంత్రాగారంలోని చిన్న మరమేకు మాత్రమే. యావత్తు విజయమూ సమిస్టిబలం తాలూకు ఫలమే. తనను నడిపించే పార్టీగానీ సంస్థగానీ తనకు అండదండలనందించే ప్రజారాశులుగానీ లేకపోతే వ్యక్తి ఏమీ సాధించలేడు. చరిత్రలో ప్రజలూ, వ్యక్తులూ నిర్వహించిన పాత్రల గురించీ వాటి పరస్పర సంబంధం గురించీ మనం సరిగ్గా అవగతం చేసుకున్నప్పుడు వినయం మనకు సహజసిద్ధంగా అలవడుతుంది.

మార్క్సిజం - లెనినిజం భవిష్యత్తును గురించిన, మనం చేరవలసిన గమ్యాన్ని గురించిన మన అవగాహనను పెంపొందించగలరు. మన దృక్పధాన్ని విశాలం చేయగలదు, మన ఆలోచనల్ని సంకుచితత్వం నుండి విముక్తం చేయగలదు. తమ కాళ్ళకింద వున్నదాన్ని మాత్రమే చూడగలిగి కొండకోనల్ని దాటి సముద్రాలకావల ఏముందో చూడలేనివారు 'నూతిలో కప్ప' ఎంత భేషజాలకు పోగలదో అంతగానూ పోగలుగుతారు. అయితే, ప్రపంచం ఎంత అపారమైనదో, మన వ్యవహారాల వర్ణవైచిత్రి ఎంతటిదో, మానవాళి ఆశయం ఎంత దేదీప్యమానమైనదో, ఎంతటి శోభను వెదజల్లుతుందో, మానవుని ప్రజాపాటవాలు ఎంత సుసంపన్నమైనవో, విజ్ఞానం ఎంత విశాలమైనదో గమనించడానికి వారు తమ దృక్కుల్ని సారిస్తే వెంటనే వినమ్రులౌతారు. మనం ప్రపంచాన్ని అతలాకుతలం చేసే ఒక బాధ్యతకు అంకితమై వున్నాం. మనం కేవలం మన కళ్ళముందుండే పనీ సుఖసంతోషాల మీద మాత్రమే దృష్టిని నిలపకూడదు, సుధూర భవిష్యత్తులో మనందరి పనీ సుఖసంతోషాల మీద దృష్టిని కేంద్రీకరించాలి. ఒక చిన్న విజయం లేదా ఒక చిన్న సాఫల్యం కారణంగా ఆత్మసంతృప్తి చెందు చిన్నపాటి ఉత్పత్తిదారుడి వైఖరిని అధిగమించడానికి మార్క్సిజం, లెనినిజం మనకు ఉపకరిస్తుంది. నిరంతరాయ పురోగతి కోసం మన ఆకాంక్షకు అది ఊపునిస్తుంది. అదే సమయంలో మన భావవాద స్వీయాత్మక ఆలోచనాపద్ధతిని నిర్మూలించడానికి అది తోడ్పడుతుంది.

18) వినయం, తనని తాను చిన్నచూపు చూసుకోవడం - ఈ రెండూ పర్యాయపదాలు కావు. వినయం అంటే తనని తాను చిన్నచూపు చూసుకోవడం కాదు. అది భౌతిక వాస్తవికత వెలుగులో వాస్తవాలను చూడడానికి తోడ్పడే ఒక వారసత్వం వైఖరి, పురోగామి చైతన్యం తాలూకు వ్యక్తీకరణ. కాగా, తనను తాను చిన్నచూపు చూసుకోవడం అనేది అవాస్తవికతకూ, ఆత్మస్థైర్యం లేకపోవడానికీ, ఇబ్బందులకు వెరవడానికీ ఒక వ్యక్తీకరణ.

తనను తాను చిన్నచూపు చూసుకోవడం, సొంత డబ్బా వాయించుకోవడం. ఆధిక్యతాభావాన్ని ప్రదర్శించడం అనేవి స్వీయమానసికతత్వంపై ఆధారపడి వుంటాయి. ఇవన్నీ తప్పుడువే. అవి ఒక వ్యక్తి తనను గురించి తాను వేసుకున్న తప్పుడు, స్వీయమానసిక అంచనా ఫలితాలు. రెండూ రెండు విపరీత ధోరణులే. స్వోత్కర్షకు పాల్పడే వ్యక్తి వాస్తవం నుండి దూరమైపోతాడు, తనను గురించి ఎక్కువగా అంచనా వేసుకుంటాడు. తన నిజ సామర్థ్యాన్ని గురించీ, తన పాత్రను గురించీ గోరంతలు కొండతలు చేస్తాడు. అతడు, తాను సమాన్యుడిని కాదనీ ఇతరులకంటే అధికుడిననీ భావిస్తాడు. అందుచేత అతడి పురోగతి ఆగిపోతుంది. కొత్త విషయాలను నేర్చుకోవడం ఆపివేస్తాడు. అతడు అనివార్యంగానే తప్పులు చేస్తాడు. తనని తాను చిన్న చూపు చూసుకునే వ్యక్తి స్వోత్కర్షకు పాల్పడే వ్యక్తికి పూర్తిగా విరుద్ధమైనవాడే కానీ, ఇతను కూడా అతనంతటి అవాస్తవికంగానే వుంటాడు. అతను తనని గురించి తక్కువగా అంచనా వేసుకుంటాడు. తాను తన పనినీ క్రమ శిక్షణనూ మెరుగుపర్చవచ్చుననే విషయాన్ని విస్మరిస్తాడు. విప్లవంలో తాను నిర్వహించబోయే పాత్రను గురించి చిన్నచూపుతో వుంటాడు. పర్యవసానంగా అతను పురోగతిని సాధించగలననే ధైర్యాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోతాడు. తన పోరాట చైతన్యాన్ని నీరుగార్చుకుంటాడు.

క్లుప్తంగా చెప్పాలంటే తనను తాను చిన్నచూపు చూసుకోవడం, అహంబావం అనే రెండూ తప్పుడు ధోరణులే. ఎందుకంటే ఈ రెండూ కూడా ఒక వ్యక్తి విప్లవంలో తన పాత్ర గురించి వేసుకున్న తప్పుడు అంచనానూ ఒక అవాస్తవిక అశాస్త్రీయ వైఖరినీ సూచిస్తాయి. రెండు ధోరణులూ విప్లవానికి ప్రమాదకారులే. అందుచేతనే మనం అహంకారానికీ స్వోత్కర్షకూ పాల్పడడాన్ని కృతనిశ్చయంతో ప్రతిఘటించాలి. విషయాన్నీ తనను తాను చిన్న చూపు చూసుకోవడాన్నీ వేరు చేసి చూడాలి. ఈ విధంగా చేస్తే మనం ఒక విపరీత ధోరణి నుండి మరో విపరీత ధోరణికి కొట్టుకుపోవడాన్ని నవారించుకోవచ్చు.

(5వ పేజీ తరువాయి భాగం)

ఆ తర్వాత 1992 మే 15-17 తేదీల్లో హైదరాబాద్‌లో 'భూసంస్కరణల అమలు' మరియు భూ యజమాన్య పద్దతుల అభివృద్ధి' విషయాలపై జరిగిన వర్క్‌షాపులో శ్రీ యుగంధర్, యస్.ఆర్. శంకరన్, ఎస్‌విఎల్‌ఎన్ శాస్త్రి, రమేష్, కామ్రేడ్ కొల్లా వెంకయ్య, కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి తదితరులు పాల్గొన్న సమావేశం కూడా కొన్ని సిఫార్సులు చేసింది. వాటినే యిటీవల కేంద్ర ప్రభుత్వం 2013 జులై 18తేదిన విడుదల చేసిన ముసాయిదాలో కూడా చేర్చింది. ఆ సిఫారసులను కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈ ముసాయిదాలో ఉన్న పేదల అనుకూల విషయాలను పార్లమెంటులో చట్టం చేసి అమలు చేయాలని వివిధ రైతు కూలీ సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. భూపంపకం సమస్యతోనే పీడిత ప్రజల విముక్తి సమస్య ముడిపడి ఉందని చివరి శ్వాస వరకు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు పరితపించారు.

దేశంలో విప్లవోద్యమ క్రమంలో విప్లవకారులు అనేక చీలికలకు గురైనారు. ప్రజాతంత్ర విప్లవం అనేక నష్టాలకు గురైంది. చివరికి విప్లవకారులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకొనే స్థితి వచ్చింది. కనీసం సమస్యలపై ఐక్యకార్యాచరణ చేపట్టని స్థితి ఏర్పడింది. ఒకరి అనుభవాలు మరొకరు నేర్చుకోవడానికి సిద్దపడే స్థితికి పూనుకోలేదు. ఈ స్థితిలో విప్లవకారుల ఐక్యత అవసరమని భావించి ఐక్యత కోసం కృషి చేశారు. విప్లవ పంథాతో ఏకీభావం ఉన్న సంస్థలతో ప్రధానంగా చర్చించారు. విప్లవకారుల ఐక్యత సాధించడం ద్వారానే భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం జయప్రదం చేసుకోగలమని భావించి, దానికోసం పరితపించాడు. ఉద్యమ క్రమంలో ఆయన వైపు నుండి జరిగిన తప్పొప్పులను ఆయన గుర్తించిన మేరకు ఆత్మ విమర్శచేసుకుని ఉన్నత విలువలను పాటించారు. ఆయన కోరిక, కృషి విప్లవకారుల ముందు ఇంకా మిగిలే వుంది.

దేశమంటే ప్రజలనీ, ప్రజలంటే కూడా అట్టడుగున పడి కనిపించని చరిత్ర గలిగిన వారని ఆయన భావన. వారి కోసం అహోరాత్రులు శ్రమించాడు. ఈ పోరాటంలో తన ఆస్తిని సైతం తృణప్రాయంగా భావించి పార్టీకి అప్పగించాడు. తన జీవిత చరమాంకంలో ప్రభుత్వం నుండి వచ్చిన పెన్షన్‌ను సైతం పార్టీకి అప్పగించారు. తన కోసం కాకుండా ప్రజల కోసం మరణించిన ఆ కామ్రేడ్‌ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి. వ్యవసాయక విప్లవోద్యమం నిర్మించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి. సుందర సుస్యందన నందన వనానికి బాటలు వేయాలని కలలు కని ఈ దేశ విముక్తికోసం తమ విలువైన ప్రాణాలను అర్పించిన వేలాదిమంది అమరుల ఆశయాలను ఆవిధంగా ముందుకు తీసుకెళుదాం.

కామ్రేడ్ కాల్లా వెంకయ్యగారికి విప్లవ జోహార్లు.

సి.పి.ఐ (యం.యల్) న్యూడెమోక్రసీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

ఖమ్మం డివిజన్ ఎ.ఐ.కె.ఎం.ఎస్. జనరల్ కౌన్సిల్

ఎఐకెఎంఎస్ ఖమ్మం డివిజన్ జనరల్‌కౌన్సిల్ సెప్టెంబర్ 21న ఖమ్మంలో మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాలులో వంద మందితో జరిగింది. ఈ సమావేశానికి పుల్లారావు, సురేష్, సైదులు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఎ.పి.సి.ఎల్.సి. జిల్లా నాయకుడు ఎం. సుగుణారావు ప్రారంభోపన్యాసం చేయగా ఎస్.కె. ముఖ్తార్‌పాష (సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు), గౌని ఐలయ్య (ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి), నాయకులు ఎం. గిరి, తిమ్మిడి హన్మంతరావులు ప్రసంగించారు. అనంతరం ఎఐకెఎంఎస్ ఖమ్మం డివిజన్ కార్యవర్గం ఎన్నికయినది. అధ్యక్షునిగా తిమ్మిడి హన్మంతరావు, ఉపాధ్యక్షునిగా పుల్లారావు, కార్యదర్శిగా ఎం. గిరి, సహాయ కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా సైదులుతో పాటు 11 మందితో కార్యవర్గం ఎన్నికయినది. వివిధ సమస్యలపై తీర్మానాలు ఆమోదించారు.

వ్యవసాయ దారులకు అందని బ్యాంకు రుణాలు - కారణాలు

వ్యవసాయం వృత్తిగా స్వీకరించాలనుకుంటున్న, ఇప్పటికే అందులో వున్నవారు వ్యవసాయాన్ని కొనగించాలనుకుంటున్నా వారికి చేతిలో భూమి వుండాలి. అది సాగు యోగ్యమై వుండాలి. కానీ దేశంలోనూ, రాష్ట్రంలోనూ సాగుయోగ్యమైన భూమి, నిజంగా వ్యవసాయం చేద్దామనుకుంటున్న గ్రామీణ ప్రజల చేతుల్లో లేదు. భూమినిజమైన సాగుదారుల చేతుల్లో లేకుండా, వ్యవసాయోతర వృత్తుల్లో జీవనోపాధిని పొందిన వాళ్ళచేతుల్లోనూ, భూమిని పంటల ఉత్పత్తి వనరుగా కాకుండా 'ఆస్థి'గా చూసే వాళ్ళ చేతుల్లోనూ ఇరుక్కుని వుంది. మరీ ముఖ్యంగా అభివృద్ధి, నగరీకరణ పేరుతో వ్యవసాయ భూమి, వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించబడుతోంది. ప్రభుత్వం ధారాళంగా పారిశ్రామిక వేత్తలకు, లాభాపేక్ష కలిగిన సంస్థలకు వేల ఎకరాల భూమిని కట్టబెడుతోంది.

రైతుకు భూమి ఎంత ముఖ్యవనరో రైతులు వ్యవసాయం చేసేందుకు పెట్టుబడి కూడా అంతే కీలకమైన వనరు. పంట సాగు చేయాలన్నా, అందుకు అవసరమైన మౌలిక వనరులు సమకూర్చుకోవాలన్నా పెట్టుబడి అవసరం ఎంతైనా ఉంది.

రైతులకు అవసరమైన పెట్టుబడి ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి రుణాల రూపంలో అందాలి. ఆ రుణాలు వడ్డీ లేకుండానో, తక్కువ వడ్డీరేట్లకో అందాలి. ముఖ్యంగా పంట రుణాలు నిజమైన సాగుదారులందరికీ అందాలి. కానీ బ్యాంకు రుణాలు వ్యవసాయదారులకు అందడం లేదు. అందినా జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డి.ఎల్.టి.సి) నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అందడం లేదు. మన రాష్ట్రంలో 30 శాతంగా వున్న కౌలు రైతులకు అందుతున్న పంట రుణాలు నామమాత్రం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీలు మాత్రం వ్యవసాయ రంగానికి రుణాలు (ప్రత్యేక్ష రుణాలు, పరోక్ష రుణాలు) పుష్కలంగా ఇస్తున్నామనీ, పంట రుణాలు, కాలికరుణాలు కూడా లక్ష్యాలను మించి ఇస్తున్నామనీ ప్రకటిస్తున్నాయి. మరి ఈ రుణాలన్నీ ఎవరికి వెళుతున్నాయి. ఎక్కడికి వెళుతున్నాయి. ఇది అందరి మెదళ్ళనూ తొలిచేస్తున్న ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు దొరకాలంటే మనం కొన్ని విషయాలను లోతుగా పరిశీలించి అర్థం చేసుకోవాలి. అప్పుడే బ్యాంకు పెట్టుబడులు వ్యవసాయరంగ రుణాల పేరుతో ఎవరికి చేరుతున్నాయో అర్థమవుతుంది.

◆ 1990 దశకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాణిజ్య బ్యాంకుల బ్రాంచీలు పెద్ద ఎత్తున మూత పడ్డాయి. వ్యవసాయానికి అందాల్సిన రుణ పరపతి వేగంగా పడిపోయింది. చిన్న, సన్న కారు రైతులు వ్యవసాయ రుణాల అందుబాటు నుండి పక్కకు నెట్టి వేయబడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఆధిపత్యం పెరిగింది. గ్రామీణ రుణ పరపతి సదుపాయంలో వివిధ రాష్ట్రాల మధ్య అంతరాలు కూడా విపరీతంగా పెరిగాయి. ప్రాంతాల మధ్య కూడా రుణాల పంపిణీలో తీవ్రమైన అసమానతలు చోటు చేసుకున్నాయి. చారిత్రకంగా వెనుకబడిన ప్రాంతాలలో రుణ పరపతి సౌకర్యం అందకుండా పోయింది. మరీ ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా అవకాశాలకు దూరంగా వున్న సామాజిక శ్రేణులు, సంస్థాగత ఆర్థిక వ్యవస్థ చట్రం బయటకు విసిరేయబడ్డారు.

1972-2011 మధ్య వ్యవసాయానికి
బ్యాంకు రుణాలలో పెరుగుదల శాతం (సంవత్సరానికి)

కాలం	మొత్తం వ్యవసాయ రుణాలు	మొత్తం బ్యాంకు రుణాలు
1972-81	16.3%	8.4%
1981-1991	6.8%	8.0%
1991-2001	2.6%	7.3%
2001-2011	17.6%	15.7%

ఆధారం: బి.ఎస్.ఆర్., ఆర్.బి.ఐ పత్రాలు

◆ 1990 దశకానికి 2000 దశకానికి పోల్చి చూస్తే వ్యవసాయ రుణాలు గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వాలకు అకస్మాత్తుగా గ్రామీణ పేదల మీద, రైతుల మీద ప్రేమ పెరిగినట్లు అనిపిస్తుంది. కానీ వాస్తవం అదికాదు. బ్యాంకులు అందించే ప్రత్యక్ష (డైరెక్ట్), పరోక్ష (ఇన్‌డైరెక్ట్) పెట్టుబడి విషయంలో నిర్వచనాలను మార్చుకుంటూ రావడం వల్ల ఈ రుణాల పెరుగుదల కనిపిస్తుంది. బ్యాంకుల నుంచి వ్యవసాయ రంగ ప్రత్యక్ష రుణాలను అందుకోవాల్సిన రైతుల స్థానంలోకి చాలా కొత్త శక్తులు వచ్చి చేరాయి. పరోక్ష రుణాలు కూడా పూర్తిగా రైతులకో, వ్యవసాయానికో, గ్రామీణాభివృద్ధికో అందలేదన్న విషయం వ్యవసాయం పేరుతో ఇచ్చిన రుణాలన్నీ, మెల్ల మెల్లగా వ్యవసాయేతరుల, ధనికుల, పెట్టుబడిదారుల, కార్పోరేట్ల చేతుల్లోకి వెళ్ళి పోయాయనే విషయం కూడా పరిశీలిస్తే అర్థమవుతుంది.

◆ యూ.పీ.ఏ-1 ప్రభుత్వం "గ్రామీణ భారతానికి కొత్త రూపు" పేరుతో 2004లో విడుదల చేసిన పత్రంలో వ్యవసాయానికి ఇచ్చే రుణాలు మూడు సంవత్సరాల కాలంలో రెట్టింపు చేయాలని లక్ష్యంగా ప్రకటించింది. 2004 జూన్‌లో వెలువడిన "సమగ్ర రుణ విధానం"లో ప్రతి సంవత్సరం 30 శాతం వరకు వ్యవసాయ రుణాలలో పెరుగుదల సాధిస్తామనీ, ప్రతి బ్యాంకు శాఖా 100 మంది కొత్త రైతులకు రుణం అందిస్తుందనీ (సంవత్సరానికి 50 లక్షల మంది రైతులు) ప్రతి బ్యాంకు శాఖా తన పరిధిలో 2, 3 కొత్త వ్యవసాయ ప్రాజెక్టులకు పెట్టుబడిని అందిస్తుందనీ ప్రకటించింది అంతే కాదు, బ్యాంకులు రుణ విముక్తి పథకాలను చేపడతాయనీ, రుణాలను పునర్వ్యవస్థీకరిస్తాయనీ, ఒకే దఫా చెల్లింపు అవకాశాలను కల్పిస్తాయనీ, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుండి రైతులు విముక్తి పొందేందుకు ఆర్థిక సహాయం అందిస్తాయనీ ఈ విధాన పత్రం ప్రకటించింది.

◆ ఈ లక్ష్యాలు చాలా ఉదాత్తంగా కనిపిస్తున్నాయి కదూ? ఆచరణలో ఈ లక్ష్యాలన్నీ నిజమైన అర్థంలో అమలయి వుంటే, ప్రతి గ్రామీణ కుటుంబమూ ఇప్పటికే సంస్థాగత రుణ సౌకర్య పరిధిలోకి వచ్చి వుండాలి. గ్రామీణ భారతమే మారిపోయి వుండాలి. కానీ అలా జరగలేదు. మొత్తం బ్యాంకు రుణాలలో గతంతో పోల్చినపుడు వ్యవసాయ రుణాల వాటా పెరిగినప్పటికీ, వాస్తవ సాగు దారులకు, గ్రామీణాభివృద్ధికి ఆ రుణాలు అందలేదు.

ప్రత్యక్ష పెట్టుబడి: (ణఱతీవషీ ఖీఱఅఋఅఎవ)

సాధారణంగా ప్రత్యక్ష పెట్టుబడి అంటే రైతులకిచ్చే పంట రుణాలని మనం అర్థం చేసుకుంటాం. పంటలను ఉత్పత్తి చేసేందుకే ఈ రుణాలు ఇస్తారని కూడా అనుకుంటాం. కానీ అలా జరగలేదు. ప్రత్యక్ష పెట్టుబడి (డైరెక్ట్ ఫైనాన్స్) అంటే నిర్వచనమే మారిపోయింది. సంవత్సరాలు గడిచిన కొద్దీ ప్రత్యక్ష పెట్టుబడి నిర్వచనాన్ని విస్తృత పరిచారు.

◆ 1997 నుండీ, టీ, కాఫీ, రబ్బరు, సుగంధ ద్రవ్యాల లాంటి సాంప్రదాయ తోటలకు ఇచ్చే స్వల్ప కాలిక రుణాలను కూడా (కమతాల సైజుతో సంబందం లేకుండా) వ్యవసాయానికి ఇచ్చే "ప్రత్యక్ష పెట్టుబడి" క్రిందికి తెచ్చారు. తర్వాత కాలంలో అన్ని రకాల-స్వల్ప కాలిక, మధ్య కాలిక, దీర్ఘకాలిక-రుణాలను (కమతాల సైజుతో సంబంధం లేకుండా) "ప్రత్యక్ష పెట్టుబడి"గా పరిగణించారు.

◆ 2002 ఏప్రిల్ నుండీ, వ్యవసాయ ఉత్పత్తులను తాకట్టు పెట్టుకుని ఇచ్చే గరిష్ట రుణ పరిమితిని (గోదాములలో దాచుకున్న వ్యవసాయ ఉత్పత్తుల రసీదును కూడా) (గతంలో 6 నెలలకు 1 లక్ష రూపాయలు గరిష్ట రుణంగా ఇచ్చేవారు.) 12 నెలల కాలపరిమితితో 5 లక్షల రూపాయలకు పెంచి, దానిని కూడా ప్రత్యక్ష పెట్టుబడిగా పరిగణించారు. 2007 ఏప్రిల్ నుండీ, ఈ రకంగా ఇచ్చే గరిష్ట రుణ పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచారు. 2007 కంటే ముందు, బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకున్న వ్యక్తిగత రైతులకు మాత్రమే ఈ రుణాలను ఇచ్చేవారు. కానీ 2007 తర్వాత, బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకున్నా, లేక పోయినా, వ్యక్తిగత రైతులకు ఈ రుణాలు ఇచ్చేలా నిబంధనను సవరించారు.

◆ 2007 ఏప్రిల్ నుండీ కార్పోరేట్ సంస్థలకు, భాగస్వామ్య సంస్థలకు, ఇతర సంస్థలకు వ్యవసాయ మరియు అనుబంధ కార్యకలాపాల కోసం 1 కోటి రూపాయల కంటే మించి ఇచ్చే రుణాలలో 1/3వ వంతు భాగాన్ని "ప్రత్యక్ష పెట్టుబడి" నిర్వచనం క్రిందకు తీసుకువచ్చారు.

ఈ మూడింటి సారాంశం ఒక్కటే. ఈ "ప్రత్యక్ష పెట్టుబడి"ని పొందే వారు నేరుగా రైతులే కానక్కరలేదనీ, వారు వ్యవసాయమే చేయనక్కర లేదనీ, వారు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల పేరుతో, తోటల పెంపకం పేరుతో వ్యవసాయ ప్రత్యక్ష పెట్టుబడులను అప్పనంగా పొందుతున్నారనీ అర్థమవుతుంది. సాధారణంగా పెద్ద పెద్ద తోటల యజమాను లందరూ రైతులుగానే పరిగణించబడి ఈ రుణాలను పొందుతారు. బ్యాంకుల నిధులన్నీ ఇటువంటి వారికే తరలివెళితే ఇక సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు పంటరుణాలు ఎక్కడి నుండి వస్తాయి? ఆంధ్రప్రదేశ్‌లో కూడా మార్కెట్ యార్డులలోని గోదాములలో పంట ఉత్పత్తులు దాచుకున్న రైతులకు 'రైతు బంధు' పథకం క్రింద రుణాలిస్తామని చెప్పారు. కానీ ఈ రుణాలు రైతులకు అందలేదు. పంట ఉత్పత్తులు రైతులనుండి కొని ఈ గోదాములలో దాచుకున్న వ్యాపారులే పెద్ద మొత్తంలో బ్యాంకులనుండి ఈ "ప్రత్యక్ష పెట్టుబడి" రుణాలను పొందారన్నది వాస్తవం.

మొత్తం వ్యవసాయ రుణాలలో ప్రత్యక్ష మరియు పరోక్ష రుణాల శాతం (1985 నుండి 2010 వరకు వాణిజ్య బ్యాంకుల ద్వారా ఇచ్చినవి)

పరోక్ష పెట్టుబడి: (Indirect Finance)

◆ 2002 ఏ వ్యవసాయానికి ప్రత్యక్ష పెట్టుబడి తీరు ఇలా ఉంటే, వ్యవసాయ రంగం కోసం అందించే "పరోక్ష పెట్టుబడి" గురించి ప్రత్యేకించి పరిశీలించాల్సి వుంది. వాస్తవానికి 1990 దశకంలో వ్యవసాయ రంగ రుణాల వాటా బాగా తగ్గినట్లు కనిపించినా, అందించిన కొద్ది " పరోక్ష పెట్టుబడి" కూడా ఎవరికి వెళ్ళిందన్నది గమనించాలి.

◆ 1993 అక్టోబర్ నుండీ, ప్రత్యక్ష, పరోక్ష పెట్టుబడి మొత్తాన్ని ప్రాధాన్యతా రంగానికి అందించే పెట్టుబడిగా పరిగణించడం ప్రారంభించారు.

◆ 1994 మే నుండీ, వ్యవసాయ అనుబంధ రంగాలకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కోసం అందించే పెట్టుబడి రుణాలను (మొదట్లో 5 లక్షల రూపాయలుగా ప్రారంభించి, 2000 సంవత్సరం నుండీ 15 లక్షలు, 2002 నుండీ 25 లక్షలు, 2004 నుండీ 40 లక్షలు) ముఖ్యంగా పశుదాణా, కోళ్ళదాణా లాంటి వాటిని సరఫరా చేయడానికి వ్యవసాయం కోసం అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణించడం ప్రారంభించారు.

◆ రాష్ట్ర విద్యుత్ సంస్థలకు (ఎస్.ఇ.బి) రైతుల బోరు బావులకు విద్యుత్ అందించేందుకుగాను లో టెన్షన్ లైన్లు వేసేందుకు అయ్యే ఖర్చుల కోసం ఇచ్చే రుణాలను కూడా వ్యవసాయానికి ఇచ్చే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణించడం ప్రారంభించారు.

◆ జులై 2005 నుండీ, విద్యుత్ పంపిణీ కార్పోరేషన్లకు, కంపనీలకు (విద్యుత్ సంస్కరణలలో భాగంగా విభజనకు గురైనవి) ఇచ్చే రుణాలను కూడా వ్యవసాయానికి అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణించడం ప్రారంభించారు.

◆ 1996 జూన్ నుండీ బిందు సేద్యం వ్యవస్థ తుంపర సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేసే డీలర్లకు ఇచ్చే రుణాలనూ, వ్యవసాయ యాంత్రీకరణ క్రింద ఇచ్చే రుణాలనూ కూడా వ్యవసాయానికి అందించే 'పరోక్ష పెట్టుబడిగా' పరిగణించడం ప్రారంభించారు. 2002 అక్టోబర్ నుండీ, ఈ డీలర్లకు గతంలో ఇచ్చిన గరిష్ట రుణ పరిమితి 10 లక్షల రూపాయలను, 20 లక్షల రూపాయలనూ పెంచారు. అక్టోబర్ 2004 నుండీ దీనిని 30 లక్షలకు పెంచారు.

◆ 2003 ఏప్రిల్ వరకూ, ఇటువంటి డీలర్లు ఖచ్చితంగా గ్రామీణ ప్రాంతాలలో, లేదా, పట్టణ ప్రాంతాలలో ఉంటే మాత్రమే ఈ "పరోక్ష పెట్టుబడి" క్రింద రుణాలు ఇచ్చే వారు. కానీ 2003 ఏప్రిల్ తర్వాత ఈ డీలర్లు ఎక్కడ వున్నా కూడా ఈ రుణాలకు అర్హులేనని నిబంధన మార్చారు.

◆ 2001 ఆగస్టు నుండీ, అగ్రిక్లినిక్‌లు, అగ్రిబిజినెస్ సెంటర్లు నిర్వహించేందుకు ఇచ్చే రుణాలను కూడా వ్యవసాయానికి అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణించడం ప్రారంభించారు.

◆ 2000 ఏప్రిల్ నుండీ, వ్యవసాయానికి రుణాలు అందించే బ్యాంకేతర ఆర్థిక సంస్థలకు (యన్.బి.ఎఫ్.సి.ఎస్) ఇచ్చే బ్యాంకు రుణాలను కూడా వ్యవసాయానికి అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణించడం ప్రారంభించారు.

◆ 2002 నవంబర్ నుండీ, వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు, వాటి నిర్వహణ కోసం (వేర్ హౌసెస్, మార్కెట్ యార్డులు, గోదాములు, శీతల గిడ్డంగులు తదితరాలు) ఇచ్చే రుణాలను (అయితే ఇవి ఉత్పత్తి ప్రాంతాల్లో, శీతల

గిడ్డంగులయితే (గ్రామీణ ప్రాంతాల్లో వుండాలి) కూడా వ్యవసాయానికి అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణిస్తున్నారు.

- 2004 మే నుండీ శీతల గిడ్డంగులతో సహా ఇతర నిల్వ కేంద్రాల నిర్మాణాలకు ఇచ్చే రుణాలను (వాటిని ఎక్కడ నిర్మించినా) కూడా "పరోక్ష పెట్టుబడి"గా పరిగణిస్తున్నారు.
- 2007 జులై నుండీ, కార్పోరేట్లకు, భాగస్వామ్య సంస్థలకు, ఇతర సంస్థలకు వ్యవసాయ మరియు అనుబంధ కార్యకలాపాల కోసం (తేనెటీగల పెంపకం, పందుల పెంపకం, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం, పశుపోషణ (డైరీ) లాంటివి) ఇచ్చే రుణాలలో మూడింట రెండు వంతుల భాగాన్ని (1 కోటి రూపాయల కంటే మించి వున్న రుణాలలో) వ్యవసాయానికి అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణిస్తున్నారు.
- 2007 జులై నుండీ, 10 కోట్ల రూపాయల లోపు విలువైన ఆహారం మరియు వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం కోసం ఇచ్చే రుణాలను (గ్రామీణ ప్రాంతంలో వ్యక్తులు, స్వయం సహాయక బృందాలు, సహకార సంఘాలు నడిపేవి కాకుండా) కూడా వ్యవసాయం కోసం అందించే "పరోక్ష పెట్టుబడి"గా పరిగణిస్తున్నారు.

వ్యవసాయ రంగానికి అందించే ప్రత్యక్ష, పరోక్ష పెట్టుబడుల నిర్వచనాలలో వచ్చిన ఈ మార్పులను చూస్తే, బ్యాంకుల రుణాలు పెద్ద మొత్తంలో ఎవరికి వెళుతున్నాయో అర్థమవుతుంది. పైగా ఈ రుణాలన్నీ గ్రామీణ పేదలకు, రైతులకు గ్రామీణ బ్యాంకు శాఖల నుండి అందకపోగా ఈ రుణాలు పట్టణాలు, నగరాలు, మెట్రోపాలిటన్ నగరాల్లోని బ్యాంకుల శాఖల ద్వారా వ్యవసాయేతర వ్యాపార, వాణిజ్య వర్గాల చేతుల్లోకీ, కార్పోరేట్ల చేతుల్లోకీ వెళుతున్నాయని ఈ క్రింది గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

- వ్యవసాయరంగానికి ఇచ్చే రుణాలలో చిన్న, సన్నకారు రైతులకు నేరుగా లాభం కలిగించే ప్రత్యక్ష రుణాల వాటా క్రమంగా తగ్గుతూ, పరోక్ష పెట్టుబడి రుణాల వాటా బాగా పెరుగుతున్నదని అర్థమవుతుంది. పెద్ద పెద్ద కార్పోరేట్లు, పెద్ద నగరాలలో నిర్మించే గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఈ రుణాలనే వాడుకుంటున్నారన్నది వాస్తవం.
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు వేళ్ళాల్సిన వ్యవసాయ రంగ ప్రత్యక్ష పెట్టుబడులు, మహానగరాలలో కంపనీలు తమ స్వంత లాభదాయక వసతులను ఏర్పాటు చేసుకోవడానికి వేళుతున్నాయని అర్థమవుతుంది.
- పైగా ఈ బ్యాంకు రుణాల్లో 2 లక్షల రూపాయల లోపు రుణాల వాటా క్రమంగా తగ్గుతూ, అంతకు మించిన మొత్తాల, ముఖ్యంగా కోటి రూపాయలకు పైగా రుణం తీసుకునేవారి వాటా క్రమంగా పెరగడం కూడా ఇదే విషయాన్ని తెలియచేస్తుంది. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు 5 వేల నుండి 50 వేలలోపే రుణాలను పొందుతారు. దానికి కూడా అనేక కిరికిరిలు, పదులసార్లు తిప్పుకోవడాలు సర్వసాధారణం. మరి ఈ కోట్ల రూపాయల రుణాలు ఖచ్చితంగా 'పెద్దలే' పొందుతుంటారు. బ్యాంకులకు రుణాలు తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టేదీ, బ్యాంకులను ముంచేసేదీ ఈ 'పెద్దలే'.
- వ్యవసాయ కార్యకలాపాలు నడిచే గ్రామీణ ప్రాంతాలకు పంపిణీ అయ్యే బ్యాంకు రుణాల వాటా క్రమంగా తగ్గుతూ, పట్టణాలు, నగరాలకు, మహానగరాలకు పంపిణీ అయ్యే వ్యవసాయ రుణాల వాటా క్రమంగా పెరుగుతున్న విషయాన్ని కూడా లెక్కలు చెబుతున్నాయి.

సంవత్సరం	ప్రత్యక్ష రుణాలు	పరోక్ష రుణాలు	మొత్తం రుణాలు
1985	83.2	16.8	100.0
1990	86.8	13.2	100 0
2000	84 5	15 5	100 0
2005	76.1	23.9	100.0
2006	72.1	27.9	100.0
2007	74 5	25.5	100 0
2008	77.5	22.5	100.0
2009	77.1	22.9	100.0
2010	76.1	23.9	100.0

మూలం: ఆర్ బి ఐ వారి బేసిక్ స్టాటిస్టికల్ రిటర్న్స్ వివిధ ప్రచురణల నుండి

1990 నుండి 2010 వరకూ వాణిజ్య బ్యాంకులు ఇచ్చిన మొత్తం వ్యవసాయ రుణాలలో తరగతి వారీ రుణాలు (శాతాలలో)

రుణ పరిమితి (రూ.)	మొత్తం రుణాలలో శాతం			
	1990	**2000**	**2005**	**2010**
2 లక్షల లోపు	82 6	67.6	51 9	44.3
2 నుండి 10 లక్షల వరకూ	4.3	11.7	17.9	22 6
10లక్షల నుండి కోటి వరకూ	7.6	6.6	6.4	6 4
కోటి నుండి 10 కోట్ల వరకూ	4 2	6 7	8	6.3
10 కోట్ల నుండి 25 కోట్ల వరకూ	1 3	1.7	3 3	2.7
25 కోట్లు మించి	-	5.7	12.6	17.7
మొత్తం రుణాలు	100	100	100	100

మూలం: భారతీయ రిజర్వు బ్యాంకు వారి బి ఎస్ ఆర్ వివిధ సంచికల నుండి ..

గమనించాల్సిన కొన్ని అంశాలు:

వ్యవసాయానికి అందించే ప్రత్యక్ష రుణాల వాటా 1985లో 83.2 శాతం వుంటే 2010 నాటికి 76.1 శాతానికి పడిపోయింది. 1985లో పరోక్ష రుణాల వాటా 16.8 శాతం వుంటే అది 2010 నాటికి 23.9 శాతానికి పెరిగిపోయింది.

ప్రత్యక్ష రుణాల్లో ప్రధానమైన భాగం పంట రుణాలుగా (క్రాప్ లోన్స్) వుండాలి. పరోక్ష రుణాలు, గ్రామీణ వ్యవసాయరంగ అభివృద్ధికీ, మొత్తంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికీ ఉపయోగపడాలి. కానీ ఈ రుణాలు గ్రామీణ, బ్రాంచీల ద్వారా చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు అందలేదనీ, పట్టణ, నగరాల, మెట్రో పాలిటన్ నగరాలలోని బ్యాంకు బ్రాంచీల ద్వారా పెట్టుబడిదారులకూ, కంపనీలకూ, కార్పోరేట్లకూ అందాయనీ, మన కర్థమవుతుంది. మహానగరాలకు వ్యవసాయ రుణాలు ఎక్కువగా వెళ్ళాయన్న విషయం కూడా మన కర్థమవుతుంది. ఆయా నగరాలలో వ్యవసాయం చేయడానికి ఒక్క ఎకరం భూమి లేకపోయినా, ప్రత్యక్ష, పరోక్ష రుణాలు మాత్రం అక్కడికే తరలిపోయాయి. మహారాష్ట్ర ఇందుకో ప్రత్యక్ష ఉదాహరణ. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల శాఖలను మూసేయడం, తగ్గించడం వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలన్నీ నగరాలకూ, మహానగరాలకూ, పరిమితమైపోవడం ఈ కాలంలో జరిగిన ఒక దుష్పరిణామమైతే, గ్రామీణ ప్రాంతంలో జరిగే వ్యవసాయ కార్యకలాపాలకు అందాల్సిన పెట్టుబడిని కాస్తా, రైతులకూ, కౌలు రైతులకూ, రైతుల సహకార సంఘాలకూ కాకుండా పారిశ్రామికవేత్తలకు, కార్పోరేట్ సంస్థలకు అప్పగించడం మరో దుష్పరిణామం. ప్రభుత్వాలు, రుణ లక్ష్యాలను సాధిస్తున్నామని ఎంతగా చంకలు గుద్దుకున్నా వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా వుందన్నది మనం గుర్తించాలి.

1990 నుండి 2011 వరకూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల మొత్తం రుణాలలో వ్యవసాయ రుణాల వాటా

సంవత్సరం ప్రాంతాలు	గ్రామీణ ప్రాంతాలు	పట్టణ శాతం	మొత్తం
మొత్తం వ్యవసాయ రుణాలు			
పిరియడ్-1			
1990	85.1	14.9	100
1994	83 4	16.6	100
పిరియడ్-2			
1995	83.7	16.3	100
2005	69.3	30.7	100
పిరియడ్-3			
2006	62.4	37.6	100
2011	66 9	33.1	100
ప్రత్యక్ష వ్యవసాయ రుణం			
పిరియడ్-1			
1990	88.8	11.2	100
1994	89	11	100
పిరియడ్-2			
1995	88.6	11.4	100
2005	84.3	15 7	100
పిరియడ్-3			
2006	80	20	100
2011	74.4	25 6	100

బ్యాంకు శాఖల ద్వారా పంపిణీ చేసిన మొత్తం వ్యవసాయ రుణం (శాతంలో)

సంవత్సరం	గ్రామీణ /మధ్య తరగతి పట్టణాలలోని శాఖల ద్వారా	కేవలం గ్రామీణ శాఖల ద్వారా	నగరాల మహానగర శాఖల ద్వారా	కేవలం మహానగర శాఖల ద్వారా	మొత్తం అన్ని శాఖల ద్వారా
1990	85.1	55.5	14.9	4	100
1994	83.4	54.6	16.6	5.6	100
1995	83.7	52.7	16.3	7.3	100
2005	69.3	43	30.7	19	100
2006	62.4	37.1	37.6	23.8	100
2008	66	38 4	34	20	100

మహారాష్ట్రలో బ్యాంకు శాఖల ద్వారా పంపిణీ చేసిన మొత్తం వ్యవసాయ రుణం (శాతంలో)

సంవత్సరం	గ్రామీణ / పట్టణాల బ్రాంచీల ద్వారా	కేవలం గ్రామీణ శాఖల ద్వారా	నగరాలు/ మెట్రో పాలిటన్ నగరాల శాఖల ద్వారా	కేవలం మెట్రో పాలిటన్ నగరాల శాఖల ద్వారా
1990	82.4%	59.7	17.6%	-
1994	76.8%	52.9	23.2%	-
1995	70.5%	46.5	29.5%	-
2005	41.8%	26.1	58.2%	48.5%
2006	31.6%	18.4	68.4%	61.3%
2008	42 4%	25.7	57.6%	48.3%

ఇఫ్టూ ఖమ్మం జిల్లా జనరల్ కౌన్సిల్

సెప్టెంబర్ 25న ఇఫ్టూ ఖమ్మం జిల్లా జనరల్‌కౌన్సిల్ 100 మందితో ఇల్లందులో జరిగినది. ఎం.డి. రాసుద్దీన్, సిద్దయ్య, ఎల్. విశ్వనాదం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ముఖ్తార్ పాష ప్రారంభోపన్యాసం ఇవ్వగా జె. సీతారామయ్య, బి. రమేష్‌లు ప్రసంగించారు. అనంతరం మార్పులు, చేర్పులతో జిల్లా ఇఫ్టూ కార్యవర్గం ఎన్నికయినది.

అధ్యక్షునిగా ఎం.డి. రాసుద్దీన్, ఉపాధ్యక్షులుగా బి. రమేష్, ప్రధాన కార్యదర్శిగా జె. సీతారామయ్య, సహాయ కార్యదర్శిగా ఏపూరి వీరభద్రం, కోశాధికారిగా ఎల్. విశ్వనాదంలతో పాటు 15 మందితో జిల్లా కమిటీ ఎన్నికయినది. వివిధ సమస్యలపై తీర్మానాలు చేశారు.

కామ్రేడ్ చంద్రం తదితరులపై గుడ్డి ద్వేషంతో డి.వి.కె సాగిస్తున్న దుష్ప్రచారం, అబద్ధాలు, వక్రీకరణలు

15-9-2013 నాటి తమ ప్రజాపంథా పత్రికలో రివిజనిస్టు నాయకుడు డి.వి.క్రిష్ణ 'కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలన్నిటికీ తిలోదకాలిచ్చి స్వార్ధ ప్రయోజనాల కోసం పార్టీని చీల్చిన చంద్రం విచ్ఛిన్నకర ముఠా' పేరిట ఒక వ్యాసం రాశాడు. అందులో అనేక అబద్దాలకూ, వక్రీకరణలకూ పూనుకున్నాడు. అనేక అవాకులూ, చవాకులూ పేలాడు.

స్వార్ధ ప్రయోజనాల కోసమే చంద్రం తదితరులు పార్టీని చీల్చారా?

2004 మహాసభలకు ముందు పార్టీలో డి.వి.కె., వి.వి., రవిల రివిజనిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా ఆంతరంగిక పోరాటం జరిగింది. 2005 రాష్ట్రమహాసభల సందర్భంగా 8 మంది రాష్ట్రకమిటీ సభ్యులు (కామ్రేడ్ పైలా వాసుదేవరావు, మాదాల నారాయణస్వామిగార్లతోసహా) ప్రత్యామ్నాయ సమీక్షను పెట్టారు. అది స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయింది. ముగ్గురూ కేంద్రకమిటీ నుండి తమంత తాముగా వైదొలిగారు. మహాసభ అనంతరం కూడా గత నాలుగయిదు సంవత్సరాలుగా న్యూడెమాక్రసీ పార్టీలో ముఖ్యంగా మన రాష్ట్రస్థాయిలో తీవ్ర రాజకీయ పోరాటం సాగుతున్నది. గత మహాసభలకు ముందే రెండంచల మహాసభల పద్ధతి ప్రవేశపెట్టాలని కేంద్రకమిటీ చర్చించింది. ఈ ముగ్గురి వ్యతిరేకత మూలంగా విరమించుకున్నది. అనంతరం మహాసభలు రివిజనిజం అని నిర్ధారించిన అభిప్రాయాలుగల వారిని కేంద్ర కమిటీలో సభ్యులుగా పెట్టకూడదనే సవరణను కేంద్రకమిటీ సవరణతెచ్చి క్రిందిదాకా విడుదల చేసింది. కొన్ని మహాసభలు కూడా చర్చించాయి. అయితే ఈ ముగ్గురి వ్యతిరేకతలూ, అలకలూ మూలంగా కేంద్రకమిటీ మెజారిటీ అకస్మాత్తుగా ఆ సవరణను వుపసంహరించుకున్నది. ఇది కేంద్రకమిటీలో వివాదాలకు కారణమయింది. కా॥ చంద్రం 2003లో "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీలో రివిజనిజం" అనే ఎజండా పెట్టాడు: ఈ ముగ్గురూ రివిజనిస్టులని ఒక నోట్ కేంద్రకమిటీ కార్యదర్శిగారికి యిచ్చాడు: అటు తర్వాతనే, కేంద్రమహాసభల్లో వీళ్ళు రివిజనిస్టులనీ కా॥ చంద్రం స్పష్టంగా వేదిక నుండి మాట్లాడాడు. 2005లో జరిగిన రాష్ట్ర మహాసభ సందర్భంగా కా॥ చంద్రంనూ, ఆయన్ను బలపరిచే నాయకులు రాష్ట్రకమిటీలో వుండటానికి నిరాకరించారు. చివరికి కేంద్రకమిటీ సభ్యులకోరిక మేరకే పి.సి.లో వుండటానికి అంగీకరించారు. రాష్ట్రమహాసభ అనంతరం సెక్ర టేరియట్, రాష్ట్రకేంద్రం, పత్రిక సంపాదకవర్గాలలో వుండటానికి నిరాకరించారు. చివరికి మెజారిటీ నిర్ణయం మేరకే వాటిలో కొనసాగారు.

2004 కేంద్ర మహాసభ అనంతరం కూడా 1996 మహాసభనుండీ వస్తున్న విభేదాలు, వాదప్రతివాదాలు మరింత పెరిగాయి: నిర్వాసితుల సమస్యపై కేంద్రకమిటీ తెచ్చిన తీర్మానాన్ని రాష్ట్రకమిటీ మెజారిటీ ఆమోదించ లేదు. కేంద్రకమిటీ తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం గురించి చేసిన తీర్మానాన్ని ఈ ముగ్గురు నాయకులు, వాళ్ళను బలపరిచే కొందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. పోలవరం ప్రాజక్టుపై కేంద్రకమిటీ చేసిన తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అభివృద్ధి పేరిట సెజ్‌లనూ, కోస్టల్‌కారిడార్ వగైరాలను బలపర్చే వైఖరిని తీసుకున్నారు. ప్రభుత్వ పథకాలను కీర్తించటం మొదలు పెట్టారు. వాటికోసం ప్రత్యేక సంఘాలు ఏర్పర్చాలనే వాదనలు లంకించుకున్నారు. విచక్షణారహితంగా కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను బలపర్చటం మొదలు పెట్లారు. 1 ఆఫ్ 70 చట్టాన్ని అమలు చేయించుకొనుటకు గిరిజనుల్ని సమీకరించటానికి పూనుకోలేదు. ఆదివాసీ వ్యతిరేక వైఖరి రకరకాలుగా వ్యక్తంచేయటం మొదలు పెట్టారు. చివరికి సి.పి.ఐ. సి.పి.ఐ.(యం)లతో సహా పది పార్టీల ఐక్యకార్యచరణ దేశంలో ఒకే కమ్యూనిస్టుపార్టీ నిర్మాణానికి దారితీయాలని వుద్బోధించటం మొదలు పెట్టారు.

ఈ నేపధ్యంలోనే కేంద్రకమిటీ మహాసభల కార్యక్రమం ప్రారంభించింది. 2008 లో మహాభల కార్యక్రమం చేపట్టింది. 2009లో ఈ సమాచారాన్ని క్రింది కమిటీలకు తెలియజేసింది. మహాసభలకు డాక్యుమెంట్లు తయారుకావటం ప్రారంభమైంది. రివిజనిజంపై డాక్యుమెంటు తయారుచేయాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. కా॥ చంద్రంను ఈ డాక్యుమెంటు తయారు చేయమని కోరారు. ఆయన తయారు చేశాడు. కేంద్రకమిటీ దాన్ని అంగీకరంచలేక పోయింది. అయినా దీన్ని ఆయన డాక్యుమెంటుగా క్రిందికి పంపకం చేయాలని నిర్ణయించింది. దీనిపై డి,వి,కె.,వి.వి. రవిల వర్గం అనేక అభ్యంతరాలు లేవదీసింది. చివరికి సి.సి.యే "...రివిజనిజాన్ని, మితవాదాన్ని వ్యతిరేకించండి!" అనే పేరిట ఒక డాక్యుమెంటును విడుదల చేసింది. చంద్రం "సి.పి.ఐ.(ఎం.ఎల్) ఎన్డీ లో రివిజనిజాన్ని, మితవాదాన్ని వ్యతిరేకించండి" అనే డాక్యుమెంటును ప్రత్యామ్నాయంగా రాశాడు. డి.వి.కె. వి.వి. రవిలు "అతి వాదాన్ని, మితవాదాన్ని ముఖ్యంగా అతివాదాన్ని వ్యతిరేకించండి" అనే డాక్యుమెంటును ప్రత్యామ్నాయంగా రాశారు. ఇందులో పార్టీ మౌలిక డాక్యుమెంట్ల-కార్యక్రమం, పంథా, రాజకీయ తీర్మానం- అవగాహన్ను వ్యతిరేకించే అనేక అంశాలున్నాయి: భారతదేశంలో విప్లవ పరిస్థితులే లేవని సెలవిచ్చారు. సంవత్సరకాలంపాటు గ్రామం నుండి జిల్లా స్థాయిదాకా మహాసభలు జరిగాయి. ఖమ్మం జిల్లాలో తమ రాజకీయాలు వ్యతిరేకించేవారిని క్రిందిసభల్లోనే ప్రతినిధులుగా రాకుండా చేశారు. తమనూ, తమ రాజకీయాలను బలపర్చేవారినే కమిటీల్లోకి తీసుకుంటూ పెద్దసంఖ్యతో కూడిన కమిటీలను నిర్మాణం చేసుకున్నారు. విభేదించేవారిని ఈ కమిటీలో నామమాత్రం చేశారు. ప్రతినిధుల్ని ఎంపిక చేయటంలో కూడా యిదే పద్ధతి అనుసరించారు. దాదాపు ఖమ్మంలో అనుసరించిన పద్ధతినే అదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ వగైరాలచోట అనుసరించారు. ఈ రకమైన 'ప్రజాస్వామిక' వాతావరణంలో ఈ ప్రాంతాల్లో సభలు జరిగాయి. కమిటీల ఎన్నికలు జరిగాయి. సర్వం త్యాగం చేస్తున్న కార్యకర్తలకూ, సీనియర్లకూ కమిటీల్లో, ప్రతినిధుల్లో స్థానం లభించలేదు. జూనియర్లకూ, పార్లమెంటరీ, లీగలు రాజకీయాలు మోస్తున్న వాళ్ళకు మాత్రం కమిటీల్లో స్థానాలు, ప్రతినిధుల్లో స్థానాలు దక్కాయి. ఈ మహాసభల సందర్భంగా డి.వి.కె.గారి అనుచరులు సాగించిన అదిరింపులకూ, బెదిరింపులకూ కొదవే లేదు!

2012 జనవరి చివరిలో జిల్లా మహాసభలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో సి.సి.డాక్యుమెంటును, ఇద్దరి డాక్యుమెంటును పది జిల్లాలు గెలిపించాయి. అయినా తాము కేంద్రకమిటీని కైవసం చేసుకోవాలనీ, తమ రివిజనిస్టు రాజకీయాలనూ, సిద్ధాంతాలనూ గెలిపించుకోవాలని డి.వి.కె.వర్గం కొత్త ఎత్తులు ప్రారంభించింది. ఒక వైపు సభ్యత్వ ప్రాతిపదికన కేంద్రమహాసభకు ప్రతినిధుల్ని ఎంపిక చేయాలని మెజారిటీ పి.సి.చేత తీర్మానాలు చేయించటం మొదలు పెట్టారు. మరోవైపు మార్చి-ఏప్రిల్ మాసాల్లో తమను బలపరిచే శ్రేణులను రాష్ట్రవ్యాపితంగా చీలికకూ సిద్ధంచేశారు. సి.పి.ఐ. (యం.యల్) రెడ్‌ఫ్లాగ్‌ను ఏర్పర్చుకోడానికి సన్నాహాలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ నాయకుడు ప్రదీప్‌సింగ్ రాకూర్ నాయకత్వాన కేంద్రకమిటీ నిర్మాణానికి కూడా సన్నాహాలు చేసుకున్నారు. అందువల్లనే పశ్చిమ బెంగాల్‌లోని వీరి అనుచరులు అక్కడి రాష్ట్ర కమిటీ నుండి విడిపోతామని పోరాటం ప్రారంభించారు. అంతిమంగా అక్కడ సి.పి.ఐ (యం.యల్)ను ఏర్పర్చుకున్నారు. దివాకర్, సూర్యంలు డి.వి.కె.వర్గం పార్టీనుండి చీలిపోతామంటున్నారనీ కామ్రేడ్ చంద్రం దృష్టికి తెచ్చారు. అందరూ కలిసి ప్రధాన కార్యదర్శిని రాష్ట్రానికి పిలిపించారు. కొన్ని ప్రతిపాదనలు పెట్టించారు. ఈ సందర్భంగా కుదిరిన ఒప్పందం ప్రకారం మే చివరి వారంలో పి.సి.సమావేశం జరిగింది. ఈ సమావేశం నాటికి బోధన్ సతీష్‌తో డి.వి.కె.వర్గం ప్రత్యక్షమ యింది. ఈ లేఖను కా॥ చంద్రంకు వ్యతిరేకంగా రాజకీయ బ్రహ్మాస్త్రంగా వుపయోగించు కొనుటకు పావులు కదపడం ప్రారంబించారు: తమ చీలిక ప్రయత్నాలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రివిజనిస్టు రాష్ట్ర కమిటీతో తెగతెంపులకు కారణాలు

విచారణ కమిటీ పరిశోధన, రిపోర్టు రాయటం పేరిట దాదాపు ఐదు నెలలపాటు కాష్ట, కేంద్ర మహాసభలను వాయిదా వేయించారు. మొదట ఈ విచారణ కమిటీ రిపార్టుకూ మహాసభలకూ సంబంధం లేదని చెప్పారు. రిపోర్టు వచ్చాక దాన్ని, క్రమశిక్షణా చర్యలనూ సి.సి.కి పంపించారు. దాన్ని కేంద్రకమిటీ చర్చించి తన అభిప్రాయం చెప్పక ముందే రిపోర్టు భాగాల్ని రాష్ట్ర వుద్యమ, నిర్మాణ సమీక్షలో చేర్చి కొత్త వివాదానికి తెరతీశారు. ఇ.సి.నివేదికలో నిర్ధారించని విషయాలు కూడా అందులో చేర్చారు. దీనితో ప్రధాన కార్యదర్శినీ, వై.కె. నరేంద్రలను సంప్రదించి పి.సి. సమావేశానికి చంద్రన్న తదితర సభ్యులు హాజరైనారు. సాంబశివరావుగారు 20-12-2012న రాసిన లేఖను చర్చించమని కోరారు. సమీక్షలో పేర్కొన్న ఇ.సి.నివేదిక భాగాల్ని తొలగించమని కోరారు. మెజారిటీ అందుకు అంగీకరించలేదు. అంగీకరించకపోతే పి.సి.లో పాల్గొనబోమని స్పష్టపరిచారు. వై,కె.తదితరుల సలహా ప్రకారమే యిలా చేశారు. అంతిమంగా సి.సి.సలహా ప్రకారం పోవాలనే నిర్ణయం జరిగింది. ఈ సమావేశంలో జరిగిన నిర్ణయానికి విరుద్ధంగా సమీక్షను రాష్ట్రంలో తమ అనుచరులకు యిచ్చి ప్రచారం మొదలు పెట్టించారు. 2013 జనవరి చివరలో సి.సి.జరిగింది. చంద్రం తనపై వచ్చిన నివేదికను తాను వ్యతిరేకిస్తున్నట్లు, సి.సి. రాష్ట్ర, కేంద్రమహాసభలకు ముందే విచరాణ జరిపించాలని కోరాడు. నివేదికపై ఏదోఒక నిర్ణయం చేయాలని కోరాడు: నివేదికను ఆమోదించటం లేదని తీర్మానించారు. సమయాభావం కారణంగా మహాసభలకు ముందు విచారణ సాధ్యంకాదని సి.సి.సభ్యులు చెప్పారు. పి.సి.కోరిన విధంగా సమీక్షలో వుంచడానికి అంగీకరించాలని కోరారు. తమకు సమ్మతం కాదని చంద్రం, టాన్యా, యస్.వి.లు స్పష్టపరిచారు. డిశంబరులో చెప్పిన అభిప్రా యాలకు సి.సి.యం.లు కట్టుబడకుండా యిలా మార్చుకోటం సరికాదని స్పష్టంగా ప్రకటించారు. ప్రతిష్ఠంభన ఏర్పడింది. సి.సి.సభ్యులం ఇ.సి.నివేదికపై అభిప్రాయాలు రాసియిస్తామనీ, వాటి ఆధారంగా చంద్రం తన ప్రత్యామ్నాయ సమీక్షను తయారు చేసుకోవాలనీ కోరారు. అంతట ఒక రాజీగా తన భిన్నాభిప్రాయంతో చంద్రం ప్రత్యామ్నాయ సమీక్ష రాయటానికి అంగీకరించాడు. యస్.వి. టాన్యాలు తమ భిన్నాభిప్రాయాలు రికార్డు చేయించుకున్నారు.

జిల్లా మహాసభలు జరిగినప్పటి నుండి ఖమ్మం-వరంగల్ ఏజన్సీలో పరిస్థితులు రోజురోజుకూ క్లిష్టంగా తయారైనాయి. దళాలు మన చేయి దాటిపోయే పరిస్థితి వుందనీ, అలాంటి స్థితి ఏర్పడితే తాను కూడా దళాలనే బలపరుస్తాననీ యస్.వి. స్పష్టంగా ప్రకటించాడు జనవరి సమావేశంలో. కేంద్రకమిటీ సభ్యులు రాసిన అభిప్రాయాలు చర్చింటానికి ఫిబ్రవరి చివరిలో సమావేశం పెట్టారు. కాని సమావేశం నాటికి ఏ ఒక్కరూ తమ అభిప్రాయాలు తేలేదు. చంద్రం తన నిరసనను రికార్డు చేయించుకున్నాడు. ఇది మరోసారి మోసగించటమేనని చంద్రం ప్రకటించాడు. జనవరిలో చెప్పిన తన అభిప్రాయాన్ని రద్దుచేసుకుంటున్నట్లు రికార్డు చేయించుకున్నాడు. వరంగల్ ఎ.సి. ప్రాంతంలోని మెజారిటీ దళాలు పంపిన తీర్మానాన్ని తాము బలపరుస్తున్నట్లు చంద్రం, టాన్యాలు కూడా ప్రకటించారు. మార్చి మధ్యనాటికి సభ్యులు తమ అభిప్రాయాలు రాసి పంపారు. సి.సి.మెజారిటీ వ్యవహరిస్తున్న తీరు ఎ.పి. రివిజనిస్టులకు వుత్సాహాన్నిచ్చింది. 2013 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లలో రివిజనిస్టు ముఠా బరితెగించి మాకు ముఖ్యంగా

చంద్రానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం, మురాచర్యలూ వివిధ జిల్లాల్లో సాగాయి. ఇన్ని జరుగుతున్నా ఏప్రిల్‌లో కామ్రేడ్ చంద్రం తన ప్రత్యామ్నాయాన్ని ఆత్మవిమర్శనా పూర్వకంగా రాసి యిచ్చాడు. దీనితర్వాత రివిజనిస్టులు కామ్రేడ్ చంద్రంపైన తమ దాడిని మరింత విషపూరితంగా, దుర్మార్గంగా సాగించారు. ఈ స్థితిలో ఎ.పి.లో రివిజనిస్టుల్ని నిర్మాణపరంగా మరోసారి ఆధిపత్యానికి రానివ్వడం (తమ పూర్తిస్థాయి రివిజనిజం గెల్చిన తర్వాత) న్యూడెమాక్రసీ రాజకీయ,సిద్ధాంతాలకు,నిర్మాణానికి అత్యంత వినాశనకరమనే నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. విప్లవ కార్యకర్తల వునికికీ, ఆత్మరక్షణా సాయుధ దళాల వునికికీ ప్రమాదకరమనీ కూడా నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. అందుకే 2013 మే, 17న జరిగిన సి.సి.లో మూడు షరతుల్తో కూడిన ఒక లెటరును సి.సి.కి అందించారు. రెండంచల రాష్ట్ర మహాసభలు జరపడానికీ, కేంద్రమహాసభలో నిబంధనావళిలో డి.సి. పి.సి. కేంద్రకమిటీలలో సి.సి.లైనుకు రెండింట మూడు వంతుల మెజారిటీ వుండేలా సవరణ చేయాలి. వరంగల్-ఖమ్మం ఏజన్సీ ప్రాంతంలోని దళాల్ని సి.సి.ప్రత్యక్ష నిర్మాణం క్రిందికి తీసుకోవాలి: రాష్ట్రమహాసభల కంటే ముందే కా॥ చంద్రంపై వచ్చిన ఆరోపణల్ని సి.సి.విచారణ జరపాలి అనే షరతుల్తో కూడిన లేఖను చర్చించితే తాము రాష్ట్ర మహాసభకు హాజరవుతామని చంద్రంతో సహా ముగ్గురు సి.సి.యం.లూ ప్రకటించారు. సి.సి.ఏఒక్కదానిపై సరైన నిర్ణయం చేయలేక పోయింది. పైగా జూన్‌లో రాష్ట్ర మహాసభలు జరుపుకోమని నిర్ణయించింది. దీనిపై చంద్రం,టాన్యా,యస్.వి.లు తమ భిన్నాభిప్రాయాన్ని రికార్డు చేయించుకున్నారు. ఈ సమావేశం తర్వాత చంద్రం రాసిన ప్రత్యామ్నాయంపై డి.వి.కె.ముఠా రాసిన వ్యాఖ్యల్లో కామ్రేడ్ చంద్రాన్ని జార్జి బుష్‌తో పోల్చారు. ఆయన ముందు రెండే రెండు మార్గాలున్నాయని అదిరింపులకూ, బెదిరింపులకూ దిగారు. ఈ మురారాస్తున్న రాతల లక్ష్యం చంద్రాన్ని అపఖ్యాతి పాలు చేయటం, తమ రివిజనిస్టు లైన్ను నెగ్గించుకోవడం. ఈ స్థితిలోనే పార్టీ లైన్ను ఎ.పి.లో నిలబెట్టుకోటానికీ, పార్టీలోని విప్లవ శ్రేణుల్ని రక్షించుకోటానికి ఎ.పి. సి.పి.ఐ(యం. యల్)లోని రివిజనిస్టుల్తో తెగతెంపులు చేసుకోటం మినహా మరో మార్గం లేదని నిర్ణయించుకున్నాం. అందుకే 15-06-2013న తెగతెంపులు లేఖను సి.సి.కి అందించాం.

మేము ఎ.పి. రివిజనిస్టు పి.సి.తో తెగతెంపులు చేసుకోటానికీ, రాష్ట్ర మహాసభకు రాకపోవటానికీ కారణం డి.వి.కె.మురా ఏదో అంతులేని విమర్శలు చేస్తారనీ, దానికి మేము సమాధానం చెప్పుకోలేమనీ భయపడి ఏమాత్రం కాదు. అలా భయపడేవాళ్ళమైతే రివిసనిస్టుల సమీక్షలో ఇ.సి.రిపోర్టు బాగాలు చేర్చడానికి అంగీకరించేవాళ్ళమేకాదు. చంద్రన్న రాసిన సమాధానాలపై పి.సి.పేరిట రాసిన పరమచెత్త వ్యాఖ్యానాలూ, నీచమైన ఆరోపణలూ చూచినపుడే బయటకు వెళ్ళివుండేవాళ్ళం. అసలు కారణం రాష్ట్రపార్టీలో 1968 తర్వాత మొట్టమొదటి సారి రివిజనిజం విజయవంతం కావడాన్ని, విప్లవ శ్రేణులు నిర్వీర్యంగావడాన్ని సహించలేకనే. ఈ పరిణామాన్ని కేంద్రకమిటీ నిరోధించలేక పోతున్నది. ఆంధ్రప్రదేశ్ విప్లవ పార్టీలో రివిజనిజం గత 30 సంవత్సరాలుగా ముఖ్యంగా గత 20 సంవత్సరాలుగా పరిణామాత్మక దశ నుండి గుణాత్మక దశకు చేరుకుంది. అందుకే మేము ఆంధ్రప్రదేశ్ మెజారిటీ రాష్ట్ర కమిటీ (రివిజనిస్టు)తో మేము తెగతెంపులు చేసుకున్నాం.

మా తెగతెంపుల తర్వాత సిసియంలు హుటాహుటిన ఎ.పి.కి వచ్చారు. మా సి.సి.యం.లైన చంద్రం, ఎస్.వి., టాన్యాలకు సమాచారం లేకుండానే రివిజనిస్టులు వారిని పిలిపించుకున్నారు. రహస్య మంతనాలు సాగించారు. తదుపరి కామ్రేడ్ చంద్రంను కూడా కలిశారు. అనంతరం సి.సి.జరిగింది. 6-7-13న సి.సి. జరిగింది. మేము రాసిన తెగతెంపుల లేఖను సి.సి.అమోదించలేక పోతున్నాం అన్నదేగాని డి.వి.కె. రాసినట్లు తిరస్కరించలేదు. మహాసభల క్రమంలో పాల్గొనమని కోరిందేగాని డి.వి.కె.రాసినట్లు ఆదేశించలేదు. సి.సి. తీర్మానం చేసిందేగాని దాని అమలుకు పూనుకోలేదు. రాష్ట్ర మహాసభ జరిగేదే మాకు సమాచారంలేదు. అందువల్ల మేము మహాసభకు రాలేదని విమర్శించటం అత్యంత నీతిబాహ్యమైన, బాధ్యతారహితమైన విమర్శ. 'రాష్ట్రకమిటీ రివిజనిస్టుగా మారిపోయిందనే వారి ఆరోపణను కేంద్ర కమిటి తిరస్కరించింది.' అని డి.వి.కె. స్వోత్కర్ష చేసుకున్నాడు. వారి డాక్యుమెంటు చదవిన కమ్యూనిస్టు అభిమాను లెవరికైనా ఈ మురా రివిజనిజం ఇట్టే ఆర్ధమై పోతుంది.

నీతిబాహ్యానికీ, సంపూర్ణ దిగజారుడికీ, విలువల పతనానికీ గురైందెవరు?

మేము రవి నాయకత్వాన వున్న రాష్ట్రకమిటీని పూర్తిగా రివిజనిస్టు కమిటీగా గుర్తిస్తున్నాం. అందువల్లనే దానితో తెగతెంపులు చేసుకున్నాం. కనుకనే వివిధ స్థాయిల్లోవున్న కమిటీలను, కామ్రేడ్స్‌ను తమ తమ కమిటీలను ప్రత్యేకకంగా ఏర్పర్చుకోమని కోరాం. ఆమేరకు మా కామ్రేడ్స్ తమ కమిటీల ఏర్పాటుకు ప్రయత్నించారు: ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా మా ప్రజాసంఘాలను కూడా రివిజనిస్టు ప్రజాసంఘాలనుండి విడివడి తమ తమ ప్రజాసంఘాలు నిర్మాణం చేసుకోమని కోరాం. విప్లవకారుల ప్రజాసంఘాలు రిజిష్టర్డు సంఘాలు కావు. అందువల్ల రివిజనిస్టు ప్రజాసంఘాలనుండి విడివడిపోవడానికి డి.వి.కె. బోధిస్తున్నట్లు చట్టాలూ, కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలూ పాటించ వలసిన పనిలేదు. శ్రీరావి నారాయణ రెడ్డి 1946-51 మధ్య సాగిన మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని కించ పరుస్తూ "తెలంగాణా పోరాట నగ్న సత్యాలు" అనే పుస్తకాన్ని రాశారు. అలాగే డి.వి.కె.ని గోదావరిలోయ ఫారెస్టుకు పనిచేయమని పంపిస్తే అక్కడ గిరిజనుల్ని ఇంటర్వ్యూలు చేసి అడవి వుద్యమాన్ని కించపరుస్తూ, అక్కడ పనిచేస్తున్న కార్యకర్తలను కించపరుస్తూ రిపోర్టులు తయారు చేశాడు. 1975-1979 కాలంలో తప్పుడు రాజకీయాల్తో ప్రారంభించి 1980 మహాసభల నాటికి మితవాద, రివిజనిస్టు రాజకీయాలను నెత్తికెత్తుకున్నాడు. అందువల్లనే కామ్రేడ్ పుల్లారెడ్డిగారు డి.వి.కె. వి.వి.గార్లను 1980 రాష్ట్రమహాసభల సందర్భ ంగా రా.క.పేనల్ నుండి తొలగించారు. అపుడు మేము ఆయన చర్యను హర్షించలేక పోయాము. కాని గత 30 సంవత్స రాలుగా ముఖ్యంగా గత 20 సంవత్సరాలుగా డి.వి.కె. వి.వి. రవిలు అనుసరిస్తున్న రాజకీయ వైఖరులూ, నిర్మాణ కుట్రలూ, ఆత్మరక్షణ సాయుధ దళాలకూ, ప్రతిఘటనా పోరాట పంధాకూ వ్యతిరేకంగా చేస్తున్న చేష్టలు ఆనాటి ఆయన చర్యలే కరెక్టు అనీ, మేము ఆయన్ను అర్ధంచేసుకోటంలో పొరబడ్డామని తెలియజేస్తున్నాయి. అలాగే కామ్రేడ్ పైలా వాసుదేవరావు గురించిన అభిప్రాయాల్లో కూడా కొంతవరకు పొరబడ్డామని చరిత్ర తెలియజేస్తున్నది. అంటే కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డిగారు గానీ, వాసుదేవరావుగారు గానీ పొరబాట్లు, తప్పులు చేయలేదని కాదు. వాళ్ళు చేసిన తప్పులు లేదా పొరపాట్లు విప్లవకోవకు చెందినవి. వాటిని 1993 నాటికే కామ్రేడ్ చంద్రం గ్రహించాడు. అందువల్లనే ఈ యిద్దరు నాయకులపై అటుతర్వాత ఎలాంటి విమర్శ చేయలేదు. కామ్రేడ్ సి.పి. పట్లగానీ, పైలాపట్లగానీ ఆయన అంచనాల్లోని లోపాలను సవరించుకున్నాడు. దీనికి "జైళ్ళు, కోర్టులు" అనే సర్క్యులరులో రాసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం.

వాళ్ళిద్దరూ ఏ పొరపాట్లు చేసినా, తప్పులు చేసినా ప్రధానంగా శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాటాన్ని, గోదావరిలోయ ప్రతిఘటనా పోరాటాన్ని సమున్నతంగా నిలబెట్టుటకు వారు చేసిన కృషి మరువలేనిది. 1980, 1981 డాక్యుమెంట్ల రూప కల్పనలకు వారు చేసిన కృషి కూడా చారిత్రక ప్రాధాన్యత కలది. వీళ్ళిద్దరూ వీటిని రూపొందించి కాపాడుటకూ కృషి చేస్తే డి.వి.కె. వి.వి. రవిలు వాటిని సర్వనాశనం గావించడానికి ప్రయత్నించారు. ఈనాడు పూర్తిగా వాటికి వ్యతిరేకంగా మారిపోయి, రివిజనిస్టు జండాలు చేతబట్టుకున్నారు. వారిపై కామ్రేడ్ చంద్రన్న ఎన్ని విమర్శలు చేసినా వీళ్ళిద్దరితో పాటు వాటి రూపొందించటంలో భాగస్వామి: వారి అనంతరం గత 30 సంవత్సరాలుగా పైలాతో కలిసీ, కొద్ది సంవత్సరాలుగా ఒంటరిగా వాటి అవగాహన్ను పరిరక్షించటకు కృషి చేస్తున్నాడు. అందుకే మేము కామ్రేడ్ సి.పి. పైలాగార్ల వారసులుగా చెప్పుకుంటున్నాం. ఆ హక్కు మాకుంది. వారిపంధాను ముందుకు తీసుకపోతాం.

కామ్రేడ్ సి.పి.పైన 1984 చీలిక సందర్భంగా రాసిన రాతలను, పుస్తకాలకు పెట్టిన హెడ్డింగ్‌లను చూపెట్టి డి.వి.కె. వి.వి. రవిలు మమ్మల్ని సి.పి.వ్యతిరేకులుగా చూపడానికి ప్రయత్నిస్తున్నారు. అవకాశ వాదులుగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆనాడు ఆంతరంగిక పోరాటం సందర్భంగా కామ్రేడ్ సి.పి. తదితరులు రాసిన రాతల్లోనూ, కామ్రేడ్ చంద్రన్న వగైరాలు రాసిన సమాధానల్లోనూ పరస్పరం రాసుకోగూడని రాతలు కొన్ని వున్నాయి. వీటిపి చర్చించుకొని సవరించుకోడానికి కామ్రేడ్ చంద్రం, పైలాలు 1990-91 సందర్భంగా మూడు పార్టీల మధ్య చర్చలు సాగినపుడు ప్రయత్నించారు. కామ్రేడ్ సి.పి. తప్పుల పట్ల వీరికి ఎంత కోపం, అయిష్టత వున్నాయో అంతకు మించి ఆయనపట్ల, ఆయన రాజకీయ, సిద్ధాంత వైఖరుల పట్లా ఎనలేని అభిమానం వున్నాయి. దానికి పుస్తకాల్లోని రాతలు రాసిన సందర్భంలోనే చేసుకున్న ఆత్మవిమర్శలే అందుకు నిదర్శనం. 20 సంవత్సరాల సమీక్షలో రాసిన క్రింది వాక్యాలే అందుకు తిరుగులేని నిదర్శనం:

"తను నమ్మిన పంధా కొరకు సిద్ధాంతరీత్యా, రాజకీయం గానే గాక శారీరకంగా కూడా ఎనలేని కృషి చేశాడు. పార్టీలోని అతివాద, మితవాద రాజకీయాలను ఎదుర్కోవడంలో ప్రముఖ పాత్ర వహించాడు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు వెలుగులో పార్టీని నడుపుటకు కృషి చేశాడు. 1980 మహాసభ డాక్యుమెంట్లు ఈ కృషిలో భాగమే. ఈ డాక్యుమెంట్ల ద్వారా పార్టీని అతివాద-మితవాద పెడధోరణుల నుండి ముఖ్యంగా మితవాద పెడధోరణి నుండి కాపాడుటకు పట్టుదలతో కృషి చేశాడు. నిజమైన మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాలను కాపాడుటకు ఆఖరి క్షణం వరకు కృషి చేశాడు. నిజమైన మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ నాయకుడుగా, రాజకీయ, సిద్ధాంత నాయకుడిగా ఆదర్శవంతమైన కృషిచేసి మరణించాడు. ....
.... "......... ....
ఏమైనప్పటికీ కామ్రేడ్ సి.పి. మొత్తం జీవితాన్ని పరిశీలిస్తే ఆయన రాజకీయంగా, సిద్ధాంతరీత్యా, ఆచరణ రీత్యా మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాల్ని, విప్లవోద్యమ నిర్మాణాన్ని కాపాడటానికి చేసిన కృషి ప్రధానం. ఆయన పాజిటివ్ అంశాలనుండి నేర్చుకోవాలి. నెగెటివ్ అంశాల్ని తిరస్కరించాలి, గుణపాఠంగా తీసుకోవాలి." (20 సంవత్సరాల సమీక్ష, పేజి-298-299)

డి.వి.కె. వి.వి. రవిలు ఆరోజు చేస్తుండిన రాజకీయ, సిద్ధాంత, నిర్మాణ తప్పిదాలను కామ్రేడ్ చంద్రం, పైలాలు అనుభవ రాహిత్యం వల్ల చేస్తున్న తప్పులుగా భావించారు. సవరించుకుంటారని ఆశించారు. అందువల్లనే వారిపట్ల కామ్రేడ్ సి.పి. తీవ్రంగా వ్యవహ రించటాన్ని అంగీకరించలేక పోయారు. కాని గత 30 సంవత్సరాల వీళ్ళ రాజకీయ, సిద్ధాంత, నిర్మాణ పద్ధతులు గమనిస్తే ఆయన భావించినట్లు రివిజనిజం ఎంత ప్రమాదకరమైందో అర్థం చేసుకోగల్గాం. ఈ నేపధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 20 సంవత్సరాల సమీక్షలో కామ్రేడ్ సి.పి. నెగెటివ్ అంశాలపట్ల పున:సమీక్ష చేసుకోవలసి వుంది. కొంత ఆత్మవిమర్శ కూడా చేసుకోవలసి వుందని భావిస్తున్నాం.

(మిగతా వచ్చే సంచికలో...)

సి.పి.ఐ (యం.యల్) న్యూడెమోక్రసీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

గమనిక

చంద్రన్న వర్గం ఏజెన్సీలో సాగించే తాజా సాయుధ దళ విన్యాసాలు ఏ రాజకీయ పరమార్థం కోసం? పేరిట పి. ప్రసాదు రాసిన వ్యాసానికి సమాధానాన్ని స్థలాభావం దృష్ట్యా ఈ సంచికలో ప్రచురించలేకపోతున్నాం. వచ్చే సంచికలో ప్రచురించగలం. - మేనేజర్

KLVA 102M315

టైల్స్ యూనియన్ జనరల్ బాడీలు

ఆంధ్ర ప్రదేశ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశము సెప్టెంబర్ 7న ముకుందాపురంలోని రాంమ్మోహన్ డెకరేటివ్ టైల్స్‌లో జరిగినది. ఈసం ముత్తమ్మ, గందం శ్రీరాం, సన్నరాంబాబులు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ జనరల్‌బాడీలో వివిధ ఫ్యాక్టరీలకు చెందిన 200 మంది కార్మికులు పాల్గొన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్.కె. ముఖ్తార్‌పాష, ప్రధాన కార్యదర్శి కా॥ ఏపూరి వీరభద్రం, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కా॥ ఎం. ఏసు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కా॥ బి. లింగ్య నాయకుడు ఉప్పలయ్య, తదితరులు ప్రసంగించారు. ఇప్పటి వరకు తమ బాధ్యతలు నిర్వహించకుండా పదవులలో కొనసాగిన ఒకరిద్దరు యూనియన్ విచ్ఛిన్నానికి, తప్పుడు పద్ధతులకు పాల్పడుతున్నారని వక్తలు పేర్కొన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వల్లాల రాజయ్య, జిల్లా కార్యదర్శి ఎం. విజయ్‌కుమార్ (వీరారెడ్డి)లను యూనియన్ నుండి బహిష్కరిస్తూ జనరల్ బాడీ నిర్ణయించినది. ఈ జనరల్ బాడీలో జిల్లా కార్యవర్గం ఎన్నికయినది. గౌరవ అధ్యక్షురాలిగా ఈసం ముత్తమ్మ, జిల్లా అధ్యక్షుడిగా మూతి రాంబాబు, ఉపాధ్యక్షులుగా సన్న రాంబాబు, ఎ. సూక్య, జిల్లా కార్యదర్శిగా బి. రాంసింగ్, సహాయ కార్యదర్శులుగా గందం శ్రీరాం, ఎస్.కె. యాకూబ్, కోశాధికారిగా దుర్గా ప్రసాద్‌లతో పాటు మొత్తం 26 మందితో కార్యవర్గం ఎన్నికయినది. వివిధ సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు.

ఫ్యాక్టరీ కమిటీల ఎన్నిక : సెప్టెంబర్ 20న మరియు 24న ఖమ్మం జిల్లాలోని 13 పెంకు ఫ్యాక్టరీలలో కార్మికుల సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఎస్.కె. ముఖ్తార్‌పాష, ఏపూరి వీరభద్రం, బి. రాంసింగ్‌లు ప్రసంగించారు. ఈ సమావేశాలలో ఫ్యాక్టరీ కమిటీల ఎన్నిక జరిగినది. జిల్లా అధ్యక్షుడు మూతి రాంబాబుతో సహా శ్రీరాం, సన్న రాంబాబు, సూక్య, యాకూబ్, దుర్గాప్రసాద్, భద్రయ్య, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా : సెప్టెంబర్ 22న నూజివీడులో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశము జరిగినది. ఇఫ్టూ నాయకుడు కా॥ కె. రామారావు (విజయవాడ) యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయినాడు. సెప్టెంబర్ 23న మరియు 25న నూజివీడులోని ఆరు పెంకు ఫ్యాక్టరీలలో కార్మికుల సర్వసభ్య సమావేశములు జరిగాయి. ఎస్.కె. ముఖ్తార్‌పాష, ఏపూరి వీరభద్రం, కె. రామారావు, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు ఎల్.వి. కుటుంబరావు తదితరులు ప్రసంగించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సి.హెచ్. సంఘంనాయుడు, ఆర్.ఎన్. పాత్రుడు, మహందాతనాయుడు, కృష్ణ మోహన్, రెడ్డి సత్యనారాయణ, గండి అప్పారావు, నాగరాజు, డోల శ్రీను, తిర్పతి, రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా : నెక్కొండ : వరంగల్ జిల్లా మిల్ & హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న నెక్కొండ చల్లా గోడౌన్స్‌లో జరిగిన జనరల్ బాడీకి 200 మంది కార్మికులు హాజరయినారు. ఇఫ్టూ జిల్లా నాయకుడు టి. రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ముఖ్తార్‌పాష, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ ప్రసంగించారు. గోడౌన్‌లోని వివిధ సమస్యలపై చర్చించిన అనంతరం గోడౌన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గోడౌన్ విభాగానికి అధ్యక్షుడిగా సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా బయ్యన్ని, కార్యదర్శిగా టి. రాజు, సహాయ కార్యదర్శిగా కుమారి స్వామి, కోశాధికారిగా మాందాటి శ్రీనులతోపాటు 19 మందితో నూతన కమిటీ ఎన్నికయినది.

సెప్టెంబర్ 17 విద్రోహాన్ని నిరసిస్తూ ...

వరంగల్ జిల్లాలో నిరసన : సెప్టెంబర్ 17న విద్రోహ దినంగా పాటిస్తూ వరంగల్ జిల్లాలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. సెప్టెంబర్ 17ను బీజేపీ విమోచన దినంగానూ, సీపీఐ, సీపీఎంలూ విముక్తి దినంగాను పాటించడాన్ని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తప్పు పట్టింది. సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనంటూ ఎలుగెత్తి చాటింది. ఈ మేరకు వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, కురవి, డోర్నకల్ కేంద్రాల్లో సభలు, సమావేశాల్ని నిర్వహించింది.

మహబూబాబాద్‌లో జరిగిన సభకు పార్టీ సబ్ డివిజనల్ నాయకులు కా॥ ఎస్.కె. తాజ్‌పాషా అధ్యక్షత వహించగా, పార్టీ వరంగల్ జిల్లా నాయకులు కా॥ మండల వెంకన్న, డివిజన్ నాయకులు గుజ్జు దేవేందర్ మాట్లాడారు. 100 మందితో జరిగిన ఈ సభలో వివిధ గ్రామాల నాయకులు ఎస్.కె. జానిమియా, కె. వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, టి. పులయ్య, టి. లక్ష్మయ్య, పొన్నం చంద్రశేఖర్, బానోత్ వెంకన్న, ఎస్.కె. చిన్న తాజ్, చారి హరీష్, వెంకన్న, రమణక్క, ఎర్రమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు. కురవి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పార్టీ సబ్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ పరిక రత్నం, సామ పాపయ్య మాట్లాడారు. ఈ సమావేశానికి ఎఐకెఎంఎస్ నాయకులు బానోత్ లచ్చిరాం అధ్యక్షత వహించారు. కురవి రూరల్ మండలం బంచరాయి తండాలో రూప్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పై నాయకులే మాట్లాడారు.

డోర్నకల్ మండల సెంటర్‌లో జరిగిన సభలో పార్టీ జిల్లా నాయకులు కా॥ మండల వెంకన్న, యాస నారాయణ మాట్లాడారు. పీడీయస్‌యు ఆధ్వర్యంలో ఎక్సలెంట్ కళాశాలలో విద్రహ దినం జరిగింది. పీడీయస్‌యు వరంగల్ జిల్లా అధ్యక్షులు కా॥ బోగా రవిచంద్ర, మహ-బాద్ డివిజన్ కార్యదర్శి ఎ. శ్రీధర్, కాలేజ్ ప్రిన్సిపాల్, డైరెక్టర్లు మాట్లాడారు.

వరంగల్ జిల్లా కే సముద్రంలో కట్టం అంజయ్య అధ్యక్షతన 25 మందితో విద్రోహ దినం సభ జరిగింది. ఈ సభలో న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ ఎస్.కె. బాబు, డివిజన్ నాయకులు, ఎఐకెఎంఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి మరియు పివోడబ్ల్యూ కార్యదర్శి అనుసూర్య, శ్రీధర్‌లు మాట్లాడారు.

ఒంగోలులో జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య

రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం సెప్టెంబర్ 15న ఒంగోలు నగరంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 16 జిల్లాల నుండి 50 మంది దాకా కళాకారులు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముందుగా అరుణోదయ జెండాను ఎగురవేశారు. కళాకారులు, గొంగడితో నృత్యం మరియు 20 మందితో ఒంగోలు కళాకారులు డప్పుడ్యాన్సు విన్యాసం చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షవర్గంగా హైదరాబాద్ నుండి కా॥ వేణు, వరంగల్ నుండి కా॥ వెంకటేశ్వర్లు, గుంటూరు నుండి కా॥ సామ్రాజ్యం తూర్పు గోదావరి నుండి కా॥ భీమ శంకర్ వ్యవహరించారు. వీరందరిని ప్రకాశం జిల్లా అరుణోదయ నాయకులు కా॥ అంజయ్య సభకు పరిచయం చేశారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥ చిట్టిపాటి ంకటేశ్వర్లు ప్రసంగిస్తూ కళారంగ ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర అరుణోదయ జనరల్ కౌన్సిల్‌ను త్వరలో నిర్వహించాలని తీర్మానించారు.

అధిక ధరలను నిరసిస్తూ ...

గుంటూరు జిల్లా : అధిక ధరలను వ్యతిరేకిస్తూ ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ పిలుపుమేరకు గుంటూరు జిల్లాలో పలు మండలాల్లో యూపీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధం కారక్రమం జరిగింది.

కాకుమాను : ఈ మండల కేంద్రంలో యూపీఏ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎఐకెఎంఎస్ మండల నాయకుడు కా॥ ఆర్. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు ఎన్. రత్నశేఖర్, ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకుడు గండికోట బాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ స్థానిక నాయకులు కామ్రేడ్స్ ఎ. సీతయ్య, కె. యలమందయ్య, ఎం. పోతురాజు, పశువులేటి శివకుమారి, కామగిరి విజయబాబు, పి. భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాడు : మండల కేంద్రంలో యూపీఏ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం దూపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్నుద్దేశించి ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఇందుర్తి సుబ్బయ్య, వేల్పూరి నరసింహరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక గ్రామాల ఎఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ కొణతల నరిం్సహరావు, ఇందుర్తి నాగేశ్వర్‌రావు, బెజగం సాంబయ్య, ఇందుర్తి చిన సుబ్బయ్య, రెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు : మండల కేంద్రంలో యూపీఏ దిష్టిబొమ్మను కా॥ జూటూరి సాంబయ్య అధ్యక్షతన దగ్ధం చేశారు. అనంతరం ప్రదర్శకులనుద్దేశించి ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ముద్రబోయిన శివయ్య, పివోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎన్. విష్ణు, ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకుడు ఎన్. పోతురాజు, ఇఫ్టూ నాయకుడు ఎన్.వి. కృష్ణ మాట్లాడారు. స్థానిక నాయకులైన కామ్రేడ్స్ ఎం. రామారావు, ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు : మండల కేంద్రంలో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎఐకెఎంఎస్ మండల నాయకుడు కా॥ కగ్గా తిరుపతయ్య అధ్యక్షతన ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కా॥ మేడా వెంకట్రావ్, పివోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కా॥ ఎన్. విష్ణు, ఎఐకెఎంఎస్ నాయకులు పోతురాజు, ఇఫ్టూ నాయకులు కృష్ణ మాట్లాడారు. కామ్రేడ్స్ సాంబయ్య, పివోడబ్ల్యూ నగర అధ్యక్ష కార్యదర్శులు కె. కుముద్వీత, ఎన్. శివ పార్వతి, కె. శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా : నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వరంగల్ జిల్లాలో పలుచోట్ల కార్యక్రమాలు జరిగాయి.

మహబూబాబాద్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహశీల్దార్ గారికి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా తాజ్‌పాష అధ్యక్షతన సభ జరుగగా, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, కె. వెంకటరెడ్డి, సోమిరెడ్డి మాట్లాడారు. కురవి మండల ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారికి మెమోరాండం ఇచ్చిన అనంతరం న్యూడెమోక్రసీ నాయకులు పి. రత్నం, సామ పాపయ్య మాట్లాడారు.

డోర్నకల్ మండలంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా జరిపి, అధికారికి మెమోరాండం అందజేశారు. ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు యాస వెంకట నారాయణ మాట్లాడారు.

కంబాలపల్లిలో కా॥ ఎడ్ల అయిలయ్య మృతి



వరంగల్ జిల్లా మహ-బాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో పార్టీ సభ్యుడు కామ్రేడ్ ఎడ్ల అయిలయ్య అనారోగ్యంతో 22.09.2013న మృతి చెందాడు. పార్టీతో ఈయన కుటుంబం ఎంతో అనుబంధాన్ని కలిగి ఉంది. ఇఫ్టూ అనుబంధ హమాలీ సంఘంలో సభ్యుడిగా కూడా అయిలయ్య పనిచేశాడు.

కా॥ అయిలయ్య భౌతిక కాయంపై పారీట డివిజన్ నాయకులు కా॥ గుజ్జ దేవేందర్ ఎర్రజెండాను కప్పారు. అంతిమ యాత్రలో 200 మంది పాల్గొన్నారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి సూరబోయిన నర్సయ్య అధ్యక్షతన సంతాప సభ జరుపగా, గుజ్జు దేవేందర్ మాట్లాడారు. అయిలయ్యకు విప్లవ జోహార్లర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. తాజ్‌పాషా, జానిమియా, సామనర్సయ్య, కె. పుల్లయ్య, రమణక్క తదితరులు పాల్గొన్నారు.

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No. 1-9-295/11/4, 7th line, Maseedu Road, Vidyanagar, Hyderabad-44 and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P) Editor : M. Narayana Swamy.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M315
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	Naveeda
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
సంస్థితి	good